www.quicktodaynews.com
RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY
తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం.
తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.

వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476 క్విక్ టుడే

EDITOR : GILLALA BUCHI REDDY | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 180 | శుక్రవారం, మార్చి 22 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

## ఏక్‌నాథ్ షిండేగా ప్రచారం చేయడం దుర్మార్గం

సీఎం కావాలనే దురుద్దేశ్యం లేదు పొంగులేటి

వివరాలు 2లో

## మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

మల్కాజిగిరిపై సీఎం రేవంత్ సమీక్ష

వివరాలు 2లో

### ఎన్నికల్లో అడ్డుకునేలా

# కుట్ర చర్యలు

- కాంగ్రెస్‌పై మోడీ కక్షసాధింపు చర్యలు
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతల ఆగ్రహం

**న్యూఢిల్లీ,(క్విక్ టుడే) :** లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ కాంగ్రెస్‌ను ఇబ్బందులకు గురి చేసేందుకు కాంగ్రెస్ ఖాతాలను స్తంభింప చేశారని, ప్రధాని మోడీ ఇందుకు బాధ్యుడని కాంగ్రెస్ తీవ్రంగా ఆరోపించింది. ఇలా చేయడం వల్ల కాంగ్రెస్‌పై కక్షసాధింపు చర్యలకు దిగారని మండిపడింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, జైరామ్ రమేశ్ తదితరులు గురువారం ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల ఫ్రీజ్, ఎన్నికల బాండ్ల అంశాలపై నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమ పార్టీని దెబ్బతీసేందుకే ప్రధాని మోదీ తీవ్ర చర్యలకు పాల్పడుతున్నారని వీరంతా మండి పడ్డారు. ఎన్నికల వేళ డబ్బులేకపోవడంతో ప్రచారం చేసులేకపోతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి పాల్పడుతున్న నేరపూరిత చర్య ఇదని మండి




పడ్డారు. మా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. ఈ రోజుల్లో అకౌంట్లు పనిచేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో మీకు తెలుసు. ఎలా ఒంటి లావాదేవీలు చేయలేని పరిస్థితి ఏర్పడిం దన్నారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల ఫ్రీజ్ చేయడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గేతో పాటు.. ఆ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు మండిపడ్డారు. బీజేపీ అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తోం దన్నారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తమ పార్టీకే కాదని మొత్తం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమన్నారు. ప్రజలు పార్టీ కోసం ఇచ్చిన విరాళాలను వాడుకోకుండా చేయడం అప్రజాస్వామికమన్నారు. ఎన్నికల వేళ ప్రచారం కోసం ప్రకటనలు ఇవ్వలేకపోతున్నాం. మా నేతలను ఎక్కడికీ పంపించలేకపోతున్నాం. విమాన ప్రయాణాలు పక్కనబెట్టండి.. కనీసం రైలు టికెట్లు కొనడానికీ మా వద్ద డబ్బుల్లేవ్ అని రాహుల్ గాంధీ తెలిపారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ ఖాతాలను ఫ్రీజ్ చేయడం కాదని, భారత ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవడమని ఆయన దుయ్యబట్టారు.

మిగతా 2లో...

### ఆ ఐదు స్థానాలపై

# బిఆర్ఎస్‌లో ఉత్కంఠ

- ఎటూ తేల్చుకోలేక పోతున్న గులాబీబాస్
- పోటీ చేసేందుకు పలువురు విముఖత
- అభ్యర్థుల ఎంపికపై తర్జనభర్జన
- మెదక్ స్థానంలో హరీష్‌ను నిలిపే ఆలోచన



**హైదరాబాద్,(క్విక్ టుడే) :** ఐదు లోక్‌సభ స్థానాల్లో అబ్యర్థుల ఎంపికలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. కొందరు పోటీకి విముఖంగా ఉండడం కూడా ఓ కారణంగా చెప్పుకోవాలి. ఈ క్రమంలో అబ్యర్థుల ఎంపిక ఆలస్యం అవుతోందని అంటున్నారు. లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఆయా పార్టీ నేతలు తమ అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో బిజీబిజీగా ఉన్నాయి. మొత్తం 17 పార్లమెంటు స్థానాలకు గానూ పలువురు అభ్యర్థులను ఇప్పటికే ఆయా పార్టీలు ప్రకటించేశాయి. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ మాత్రం లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని తీవ్రంగా శ్రమిస్తోం ది. ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్ ఎంపీ అభ్యర్థుల జాబితాను ప్రకటించేశారు. అయితే ఐదు స్థానాలపై మాత్రం పార్టీలో సస్పెన్స్ కొనసాగుతోంది. మెదక్, సికింద్రాబాద్, నల్గొండ, భువనగిరి, హైదరాబాద్ స్థానాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ ఐదు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన కాస్త ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెండింగ్ స్థానాల అభ్యర్థుల కోసం కేసీఆర్ మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. నేతలు పార్టీ వీడుతుండటం కూడా అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారింది. నల్గొండ నుంచి బరిలో నిలపడానికి మొదట గుత్తా అమిత్ రెడ్డి పేరును బీఆర్ఎస్ పరిశీలించింది. అయితే అమిత్ రెడ్డి పోటీకి నో చెప్పడంతో సైదిరెడ్డికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సైదిరెడ్డి కూడా బీజేపీలోకి వెళ్లడంతో అభ్యర్థి కోసం గులాబీ బాస్ తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నల్గొండ కోసం కంచర్ల కృష్ణారెడ్డి, కడారు అంజయ్య యాదవ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే బీఆర్ఎస్ అధినేత మాత్రం కంచర్ల కృష్ణారెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇక భువనగిరిలోనూ అదే పరిస్థితి నెలకొంది. భువనగిరి కోసం మొదట మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పేరును బీఆర్ఎస్ పార్టీ దాదాపు ఖరారు చేసింది.

మిగతా 2లో...

## ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్

# అరెస్ట్



**ఢిల్లీ (క్విక్ టుడే) :** ఢిల్లీ మద్యం కేసులో ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను గురువారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని ఇప్పటి వరకూ తొమ్మిదిసార్లు కేజ్రీవాల్‌కు ఈడీ అధికారులు సమన్లు జారీ చేసినా ఆయన హాజరు కాలేదు. ఒక కుంభకోణం కేసులో సీఎం పదవిలో ఉండగానే ఈడీ అధికారులు అరెస్ట్ చేసిన తొలి రాజకీయ నేత అరవింద్ కేజ్రీవాల్ కావడం ప్రాధాన్యం సంతరించుకున్నది. ఈ కేసులో ఇది నాలుగో అరెస్ట్. ఈ కేసులో ఇప్పటి వరకూ ఆప్ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, తదితరులను ఈడీ అధికారులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కేజ్రీవాల్ ను రెండున్నర గంటల పాటు ఆయన నివాసంలోనే ఈడీ అధికారులు ప్రశ్నించారు. కాగా, ఆయన జైలు నుంచి ఢిల్లీ ప్రభుత్వాన్ని నడుపుతారని ఢిల్లీ మంత్రి అతిషి చెప్పారు. కేజ్రీవాల్ ను అరెస్ట్ చేసినందున స్థానిక న్యాయస్థానం ముందు హాజరు పరిచి రాత్రికి ఈడీ కార్యాలయానికి ఆయనను తరలించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

### అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత

# ప్రతి ఒక్కరిది

## : మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ (క్విక్ టుడే) :** ప్రకృతి మాత్రమే శాశ్వతమైనదనే సత్యాన్ని గుర్తిస్తే, మానవ మనుగడకు ఆధారంగా నిలు స్తున్న అడవు లనుజాగ్రత్తగా కాపాడుకునేలా ఉద్యమిం చేందుకు ప్రేరణ లభిస్తుందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రకృతిని సంరక్షిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడమే అర్థవం తమైన జీవితమని మంత్రి తెలిపారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని (మార్చి 21) పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. అడవులను సంరక్షి ంచుకునే దిశగా ప్రజలకు అవగాహన కలిగించే నిమిత్తం ప్రతి యేడు మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని మంత్రి సురేఖ తెలిపారు. ఈ సంవత్సరం 'అడవులు, ఆవిష్కరణలు : మెరుగైన ప్రపంచం కోసం కొత్త పరిష్కారాలు' థీమ్ తో ప్రపంచవ్యాప్తంగా అటవీ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. పర్యావణంలో సమతుల్యత లోపించి విపత్తుల బారిన పడుతున్నామని పేర్కొన్నారు.



## కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది

బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా విమర్శలు

**న్యూఢిల్లీ,(క్విక్ టుడే) :** లోక్‌సభ ఎన్నికలు సమీపించే వేళ అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల తూటాల పేలుతున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పరం ఒకరిపై

మిగతా 2లో...



### ఇసిల నియామకంలో

# స్టే ఇవ్వలేం

వివరాలు 2లో

- జోక్యం చేసుకుంటే గందరగోళానికి దారితీయగలదు
- కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టం తప్పని భావించలేం
- సుప్రీంకోర్టులో పిటిషన్లపై విచారణలో ధర్మాసనం వెల్లడి

### ఎన్డీయే కూటమికి 400 సీట్లు

# దాటాలన్నదే లక్ష్యం

- అదే లక్ష్యంతో పనిచేస్తున్నాం: కిషన్ రెడ్డి



**హైదరాబాద్, (క్విక్ టుడే) :** హైదరాబాద్ నగరంలోని బాగ్ అంబర్‌పేట్ డివిజన్ లో కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో లోక్ సభ ఎన్నికలకు నగారా మోగింది అని తెలిపారు. వచ్చే ఎన్నికలు దేశం కోసం జరిగే ఎన్నికలు.. నరేంద్రమోడీకి ఎంత మెజారిటీ వస్తదో నిర్దేశించే ఎన్నికలు.. ప్రస్తుతం దేశంలో భారతీయ జనతా పార్టీకి 302 స్థానాలు ఉన్నాయి.. వచ్చే ఎన్నికల్లో 370 సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు అని ఆయన చెప్పారు. ఎన్డీయే కూటమికి 400 సీట్లు దాటాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం.. దేశంలో గతంలో ఎన్నడూ లేని మెజారిటీని దేశ ప్రజలు నరేంద్రమోడీకి కట్టబెట్టపోతున్నారు.. దేశంలో శాంతి భద్రతలు కాపాడటం కోసం.. దేశంలో సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు చేయడం కోసం నరేంద్రమోడీ నాయకత్వంలో నీతివంతమైన ప్రభుత్వం మళ్లీ రావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారు అని కిషన్ రెడ్డి అన్నారు. దేశ గౌరవాన్ని పెంచాలంటే.. పేద ప్రజలకు సంక్షేమం అందాలంటే.. దేశంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలంటే మోడీనే మళ్లీ రావాలని 140 కోట్ల మంది ప్రజలు ఆకాంక్షిస్తున్నారు అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.

మిగతా 2లో...

### చెన్నై సౌత్ నుంచి

## తమిళిసై పోటీ



**చెన్నై,(క్విక్ టుడే) :** లోక్‌సభ ఎన్నికల కోసం తమిళనాడులో తొమ్మిది మంది అభ్యర్థు లతో కూడిన మూడో జాబితాను బీజేపీ గురు వారం విడుదల చేసింది. తమిళనాడు బీజేపీ చీఫ్ కె.అన్నామలై కోయంబత్తూరు నుంచి, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చెన్నై (సౌత్), కేంద్రమంత్రి ఎల్.మురుగన్ నీలగిరి నుంచి, నైనార్ నాగేంద్రన్ తిరునల్వేలి నుంచి పోటీ చేయనున్నారు. ఈ జాబితాలో రాధాకృష్ణన్, టీఆర్ పరివేందర్, నరసింహన్, ఏసీ షణ్ముగం కూడా ఉన్నారు. ఇక రాధాకృష్ణన్ కన్యాకుమారి నుంచి, నాగేంద్రన్ తూత్తుకుడి నుంచి, టీఆర్ పరివేందర్ పెరంబలూర్ నుంచి, కృష్ణగిరి నుంచి సి. నరసింహన్ పోటీ చేయనున్నారు. వెల్లూరు బరిలో ఏసీ షణ్ముగం ఉన్నారు. ఇటీవలే తెలంగాణ, పుదుచ్చేరి గవర్నర్ పదవికి రాజీనామా చేసిన అనంతరం తమిళిసై సౌందర రాజన్ సొంత గూటికి చేరుకున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

## ఎన్డీయే కూటమికి 400 సీట్లు దాటాలన్నదే లక్ష్యం

ప్రపంచ దేశాల ముందు దేశ గౌరవాన్ని పెంచిన వ్యక్తి నరేంద్రమోడీనే.. నరేంద్ర మోడీ గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ఒక్క రోజు సెలవు తీసుకోకుండా దేశం కోసం ప్రధాన మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించి 17కు 17 సీట్లు గెలిపించి.. దేశంలో మూడవసారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ నాయకత్వంలో ఏర్పడబోయే ప్రభుత్వంలో భాగస్వామ్యులు చేయాలని కోరుతున్నాను అని తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి తెలిపారు.

## కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది

జోస్యం చెప్పారా యన. ఆ పార్టీ నేతలకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే భారత ప్రజాస్వామ్యం, ఐటీ, దర్యాప్తు సంస్థలు, అధికారులపై విరుచుపడుతున్నరన్నారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు జేపీ నడ్డా. 'కాంగ్రెస్ పార్టీ తన అసమర్థత, చేతకాని తనాన్ని 'ఆర్థిక ఇబ్బందులు' గా పేర్కొంటోంది. అయితే నిజానికి వారు ఆర్థికంగా దివాళా తీయ లేదు. నైతికంగా, మేధోపరంగా దివాలా తీశారు. ఐటీ లేదా ఢిల్లీ హైకోర్టు అయినా నిబంధనలకు లోబడి ఉంటాయి.అందుకు తగ్గట్టే పన్నులు చెల్లించాలని కాంగ్రెస్ పార్టీని కోరాయి. కానీ ఆ పార్టీ ఎప్పుడూ అలా చేయలేదు' దేశంలో ప్రతి రంగాన్ని, ప్రతి రాష్ట్రాన్ని, చరిత్రలోని ప్రతి క్షణాన్ని అన్ని విధాలా దోచుకున్న పార్టీ ఆర్థిక క్రమశిక్షణ గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది. ఆర్థిక ఇబ్బందులంటూ చెబుతున్న కాంగ్రెస్ నేతలు జీపు నుంచి హెలికాప్టర్ల వరకు బోఫోర్స్ లాంటి అన్ని స్కామ్ ల ద్వారా దాచుకున్న సొమ్మును తమ ప్రచారానికి వాడుకోవచ్చు. భారతదేశంలో ప్రజాస్వామ్యం అబద్ధమని కాంగ్రెస్ పార్ట్‌టైమ్ నాయకులు అంటున్నారు. 1975-1977 మధ్య కొన్ని నెలలు మాత్రమే భారతదేశం ప్రజాస్వామ్యం కాదని, ఆ సమయంలో భారత ప్రధాని ఇందిరా గాంధీ తప్ప మరెవరో కాదని నేను వారికి వినమ్రంగా గుర్తు చేస్తున్నాను' అని ట్వీట్‌లో రాసుకొచ్చారు జేపీ నడ్డా.

# మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

### మల్కాజిగిరిపై సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్,మార్చి21**: మల్కాజిగిరి, కొడంగల్ తనకు రెండు కళ్లలాంటివని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంటు స్థానం ఎన్నిక అభ్యర్థిది కాదని, ముఖ్యమంత్రిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని నేతలతో సీఎం సమావేశం నిర్వహించారు. తనను సీఎంను చేసింది మల్కాజ్ గిరి గెలుపేనని గుర్తు చేశారు. అప్పుడు నాయకులు అమ్ముడు పోయినా కార్యకర్తలను భుజాలపై ఎత్తుకొని మోసి తనను ఢిల్లీకి పంపించారని అన్నారు. 2,964 బూత్ లలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారని చెప్పారు. కేసీఆర్ పతనం 2019లో మల్కాజ్ గిరి నుంచే మొదలైందని అన్నారు. మల్కాజిగిరి అభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతగా ఉండి స్కైవేల నిర్మాణానికి శంకుస్థాపన చేసునుకున్నామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని కార్యకర్తలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. తాను సీఎంగా ఉన్నానంటే.. ఆ గొప్పతనం మల్కాజిగిరి కార్యకర్తలదేనన్నారు. ఆనాడు కొందరు నాయకులు అమ్ముడుపోయినా.. కార్యకర్తలు భుజాలపై మోసి గెలిపించి తనను దిల్లీకి పంపించారని గుర్తు చేశారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ స్థానం మల్కాజిగిరి. నాటి గెలుపు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేలా చేసింది. కేసీఆర్ పతనం 2019లో మల్కాజిగిరి నుంచే మొదలైంది.

## ఆ ఐదు స్థానాలపై

కానీ పైళ్ల కాంగ్రెస్ వైపు చూస్తుండటంతో మరో అభ్యర్థి కోసం కేసీఆర్ కసరత్తు మొదలుపెట్టారు. ప్రస్తుతం భువనగిరి రేసులో మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, దూదిమెట్ల బాలరాజు ఉన్నారు. మరోవైపు సికింద్రాబాద్ నుంచి తలసాని సాయికిరణ్ పోటీకి విముఖత చూపడంతో మరో అభ్యర్థి కోసం బీఆర్ఎస్ అన్వేషణ సాగిస్తోంది. సికింద్రాబాద్ కోసం పద్మారావు, దాసోజు శ్రావణ్, రావుల శ్రీధర్ రెడ్డి పేర్లను కేసీఆర్ పరిశీలిస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి పద్మారావును పోటీ చేసేందుకు బీఆర్ఎస్ ఒప్పిస్తున్నట్లు తెలుస్తోంది. అటు మెదక్ అభ్యర్థిపైనా పీటముడి ఇంకా వీడలేదు. మొదట మెదక్ కోసం ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి పేరును కేసీఆర్ పరిశీలించారని సమాచారం. వెంకట్రామిరెడ్డి పోటీకి ఆసక్తి చూపకపోవడంతో ఒంటేరు ప్రతాపరెడ్డి పేరును అధినేత పరిశీలిస్తున్నారు. అలాగే హైదరాబాదులో పోటీ నామ మాత్రమే కావడంతో మిగిలిన నాలుగు స్థానాలపైనే ఉత్కంఠ కొనసాగుతోంది. ఒకటి, రెండు రోజుల్లోనే పెండింగ్ స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌లో ఉండే అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచార వ్యూహాలను రచిస్తున్నారు. ఇకపోతే మెదక్ సీటు మరింత ప్రతిష్టాత్మకం కావడంతో ఇక్కడ గెలుపు గుర్రాలపై ఆలోచన చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమానికి ముందు నుంచి బీఆర్ఎస్ ఇక్కడ గెలుస్తోంది.

## ఎన్నికల్లో అడ్డుకునేలా

ఈ రోజు దేశంలో ప్రజాస్వామ్యం అనేదే లేకుండా పోయింది. అది అబద్ధంగా మారింది. దేశంలో 20శాతం ఓటర్లు మాకు మద్దతుగా ఉన్నారు. కానీ మేం రెండు రూపాయలు కూడా చెల్లించలేక పోతున్నాం. ఎన్నికల్లో పోరాడకుండా మా సామర్థ్యాన్ని అడ్డుకుంటున్నారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని కేంద్రంపై రాహుల్ మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్యమే లేదన్నారు. బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేస్తే ఎన్నికల్లో ఎలా పోటీ చేయగలమన్నారు. ఎవరిదైనా బ్యాక్ అకౌంట్ మూసివేసినా, ఏటీఎం కార్డు పని చేయకుండా చేస్తే జీవించగలరా.. ప్రస్తుతం తాము ఎన్నికల్లో ప్రచారం చేసే పరిస్థితి లేకుండా బీజేపీ కుట్రకు పాల్పడిందన్నారు. ఎన్నికలకు 2 నెలల ముందు ఇలా చేయడం వల్ల కాంగ్రెస్‌ను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకూడదనేదే బీజేపీ ఉద్దేశంగా కనిపిస్తోందని రాహుల్ ఆరోపించారు.అంతకుముందు సోనియా గాంధీ మాట్లాడుతూ ప్రధానిపై విమర్శలు గుప్పించారు. మా బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను బలవంతంగా లాగేసుకుంటున్నారు.

కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు ప్రధాని మోదీ వ్యవస్థీకృతంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఓవైపు ఎన్నికల బాండ్ల వ్యవహారం.. మరోవైపు దేశంలోని ప్రధాన ప్రతిపక్షం ఆర్థిక లావాదేవీలపై దాడి జరుగుతోంది. ఇన్ని సవాళ్ల నడుమ ఎన్నికల్లో మేం సమర్థంగా ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం అని ఆమె అన్నారు. ఎలక్టోరల్ బాండ్లు తీవ్రమైన అంశమని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తెలిపారు. కేంద్రం తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, కాంగ్రెస్‌ను ఆర్థికంగా ఇబ్బందులు పెట్టే కుట్ర కనిపిస్తోందని, కేంద్రం తీరు సరిగా లేదని, కాంగ్రెస్ అకౌంట్లపై ఫ్రీజ్ తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను బలహీనపరిచే కుట్ర చేస్తున్నారని, కాంగ్రెస్ అకౌంట్లపై ముప్పేట దాడి జరుగుతోందని, అకౌంట్లను ఫ్రీజ్ చేయడమనేది దారుణమైన విషయమని సోనియా గాంధీ మండిపడ్డారు. నిధుల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి వచ్చిన ఎలక్టోరల్ బాండ్లపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ డిమాండ్ చేశారు. ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా బీజేపీకి 56 శాతం నిధులు వస్తే.. కాంగ్రెస్‌కు 11 శాతం ఫండ్స్ మాత్రమే వచ్చాయన్నారు. బీజేపీకి రూ.వేల కోట్ల ఎలక్టోరల్ బాండ్లు ఎలా వచ్చాయని ఆమె ప్రశ్నించారు. ఎలక్టోరల్ బాండ్‌ల వల్ల బీజేపీ భారీగా లాభపడిందన్నారు.

# ఏక్‌నాథ్ షిండేగా ప్రచారం చేయడం దుర్మార్గం

### సీఎం కావాలనే దురద్దేశ్యం లేదన్న పొంగులేటి




**హైదరాబాద్,మార్చి21:** పార్లమెంట్ ఎన్నికల తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ ఏకనాథ్ షిండేగా అవుతారని కొంత మంది సోషల్ మీడియా ఇంటర్వ్యూల్లో ప్రచారం చేస్తున్నారు. ఈ అంశంపై మీడియా ప్రతినిధులతో మాట్లాడినప్పుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత నేనే సీఎం అనడం ఊహాజనితమని మండిపడ్డారు. పళ్ళు ఉన్న చెట్టుకే రాళ్ల దెబ్బలు తగులుతాయని.. తన దగ్గర పండ్లు ఉన్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట రోజు ఉంటే నంబర్ 2 ఎలా అవుతానని ప్రశ్నించారు. హైకమాండ్ కూడా నేను సీఎం కావాలంటే కొన్ని ఈక్వేషన్స్ చూస్తుంది కదా..! అని ప్రశ్నించారు. నేను సీఎం కావాలని అనుకోవట్లేదు..ఆలోచన లేదుని.. తాను ఎవ్వరికీ టచ్ లోకి వెళ్ళలేదు..అదంతా ప్రచారం అన్నారు. మా ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేయదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ డబుల్ డిజిట్ ఎంపీ సీట్లు గెలవబోతున్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మీద మేము కక్ష పూరితంగా కేసూలు పెడుతున్నామంటున్నారు. అవన్నీ గత ప్రభుత్వంలో వారు అధికార దుర్వినియోగంతో చేసిన తప్పులు అన్ని కనబడుతున్నవి కదా అని ప్రశ్నించారు. జలాశయాల్లో నీరు లేకపోవడం, పంటలు ఎండిపోవడం వంటీ ఫోటోలు. వీడియోలు పెట్టి కొన్ని మీడియా సంస్థలు కాంగ్రెస్ ప్రభుత్వం పై నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. మా ప్రభుత్వం ఏర్పడింది డిసెంబర్ లో రాబోయే ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని నీటి నిల్వలు ఉంచాల్సిన బాధ్యత వారిపై ఉంది కాని చేయాల్సిన పనులు చేయకుండా భాద్యత విస్మరించి మాపై రాళ్ళేయడం తగదని మండిపడ్డారు. కాళేశ్వరం ఫలితం ఎవరికి దక్కిందో అందరికి తెలిసిందేనని పొంగులే? గుర్తు చేసారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒకటి రెండు ఎంపీ సీట్లు గెలిస్తే గొప్ప అనుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ. మాకు ఎంఐఎం మద్దతు తెలపుతుంది. ఇతర పార్టీల నుండి మా పార్టీలోకి రమ్మని మేం ఎవరిని అడగటం లేదు. వారికై వారు స్వచ్ఛందంగా వస్తున్నారని గుర్తు చేశారు. మేం ఇంకా గేట్లు ఎత్తలేదని ఎత్తితే వరద ఆగదని చేరికలపై వ్యాఖ్యానించారు. మేం చెప్పిందే చేస్తున్నం. గత పాలకుల అవినీతి మీద పోరాడుతూనే. డిస్టర్బ్ అయిన వ్యవస్థను దారిలో పెడుతున్నామన్నారు. 5ఎకరాలకు రైతు బంధు అని చెప్పినట్టే ఇస్తున్నామన్నారు. జీతాల చెల్లింపుల్లో కొంత ఆలస్యం అయిన మాట వాస్తవమే. ఆ దిశగా పరిష్కారం కోసం పనిచేస్తున్నా మన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడేందుకు వెనుకాడ బోమమని.. 14స్థానాలు గ్యారెంటీ గెలుస్తామన్నారు. రెండు సంవత్సరాలు కంటే ఎక్కువగా ఉన్న అధికారులను మొత్తం షిఫ్ట్ చేస్తాం... రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేస్తామని.. ధరణి లో మంచి అంశాలు ఉంటే ఉంచి.. భూమాత పోర్టల్ ను తీసుకొస్తామని ప్రకటించారు. ధరణిపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ధరణికి సంబంధించి తన వద్ద మరింత సమాచారం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేస్తామని.. వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్యలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరి ఫోన్లను ట్యాపింగ్ చేయడం లేదని స్పష్టం చేశారు. ధరణి ద్వారా జరిగిన అక్రమాలన్నిం టినీ ఆధారాలతో సహా బయటపెట్టి, శ్వేతపత్రం విడుదల చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గత సర్కారు ధరణిని రహస్య డాక్యుమెంట్‌గా చూసిందని, తమ ప్రభుత్వం ఏదీ దాచి పెట్టదని స్పష్టం చేశారు. ధరణిలో ప్రజలకు ఇబ్బంది కలిగించే విషయాలను తొలగించి.. మంచి వాటిని కొనసాగిస్తామన్నారు. గురువారం మీడియా ప్రతినిధులతో మంత్రి ఇష్టాగోష్టిగా మాట్లాడారు.రిజిస్ట్రేషన్ల శాఖను కూడా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ సమస్య నుంచి బయటపడ్డామని, మంచి నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసే ప్రసక్తే లేదన్నారు. మీడియా అకాడమీ ఛైర్మన్‌తో చర్చించి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కచ్చితంగా తెలంగాణలో 14 స్థానాలు గెలుస్తుందని, ఇప్పుడున్న పరిస్థితుల్లో బిఆర్ఎస్‌కు ఒకటో, రెండో వస్తే గొప్ప అని వ్యాఖ్యానించారు.

# ఇసిల నియామకంలో స్టే ఇవ్వలేం

- జోక్యం చేసుకుంటే గందరగోళానికి దారితీయగలదు
- కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టం తప్పని భావించలేం
- సుప్రీంకోర్టులో పిటిషన్లపై విచారణలో ధర్మాసం వెల్లడి

**న్యూఢిల్లీ,మార్చి21:** ఇసిల నియామకం అంశంలో స్టే ఇచ్చేందుకు సుప్రీం నిరాకరించింది. ఇద్దరు కమిషనర్ల నియామకాన్ని కూడా తప్పుపట్టలేమని తేల్చి చెప్పింది. లోక్‌సభ ఎన్నికల ముందు ఈసీల నియామకం అంశం చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం నూతనంగా తీసుకొచ్చిన చట్టాన్ని నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. చట్టంపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ దశలో నిలిపివేస్తే అది తీవ్ర గందరగోళానికి దారితీస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా ఇటీవల ఈసీలుగా బాధ్యతలు చేపట్టిన మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్బీర్ సింగ్ నియామకాలను కూడా ధర్మాసనం ప్రస్తావించింది. కొత్తగా నియమితులైన

వారిపై ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొంది. ఎన్నికల సంఘం స్వతంత్ర సంస్థ. అది పాలనాయంత్రాంగం కింద పనిచేస్తుందని చెప్పకూడదు. ఈసీల నియామకాల కోసం కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టం తప్పు అని భావించలేం. ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఈ సమయంలో సమతుల్యత పాటించాల్సిన అవసరం చాలా ముఖ్యం' అని ధర్మాసనం అభిప్రాయపడింది. 2023 చట్టం రూపొందించక ముందు ఎన్నికల కమిషనర్ల నియామక తాత్కాలిక కమిటీలో ప్రధాని, సీజేఐ, లోక్‌సభలో విపక్షనేత సభ్యులుగా ఉన్నారు. కొత్త చట్టం ప్రకారం ఏర్పడిన కమిటీలో సీజేఐ స్థానంలో కేంద్రమంత్రికి చోటు కల్పించారు. దీన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై కేంద్రం బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. కొత్త చట్టంలో సీజేఐకు చోటు కల్పించకపోవడాన్ని సమర్థించుకుంది. కమిటీలో న్యాయ సభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్న వాదన సరికాదని తెలిపింది. ఇదిలావుంటే భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా లేని ఎంపిక కమిటీ నూతన ఎన్నికల కమిషనర్లను నియమించడం సరైందేనని సుప్రీంకోర్టులో కేంద్రం పేర్కొంది. 2023 చట్టంలో సీజేఐకు చోటు కల్పించకపోవడాన్ని సమర్థించుకుంది. కమిటీలో న్యాయ సభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్న వాదన సరికాదని తెలిపింది.

PLOTS FOR SALE

JANAGAON TOWN
SRI SAI RAM VENTURE
జనగామ జిల్లా కేంద్రం.. నర్మెట్ట రోడ్
చదరపు గజం రూ.4500 -6500
99592 02369

PVR CONSTRUCTIONS
HOUSE FOR SALE

INDEPENDENT HOUSE
EAST - 167 SQ. YADS & WEST - 156 SQ. YADS
NEAR JODIMETLA X ROAD, WARANGAL HIGHWAY, HYDERABAD
9885119830
7013672656
8106654775

PLOTS FOR SALE
JANAGAON TOWN
HANUMAKONDA ROAD
78930 45646
96769 74480

జన్మదిన, వివాహ పదవీ విరమణ శుభాకాంక్షలు
ఉద్యోగం, వ్యాపారం రియల్ ఎస్టేట్ బహిరంగ ప్రకటనలు
జయంతి, వర్ధంతి శ్రద్ధాంజలి, నిర్యాణము
అన్ని రకాల ప్రకటనల కోసం సంప్రదించండి
88864 60073
81259 72476

## తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గా కోల కార్తిక్ గౌడ్



**ఉప్పల్, మార్చ్ 21 (క్విక్ టుడే) :** హైదరాబాద్ ఉప్పల్ లోని తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర కార్యాలయం లో రాష్ట అధ్యక్షుడు నాయిని భరత్ అధ్వర్యంలో పత్రికా సమావేశం జరిగింది ఈ కార్యక్రమంలో వరంగల్ కి చెందిన అడ్వకేట్ కోల కార్తిక్ గౌడ్ తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గా నియమించిన రాష్ట అధ్యక్షుడు నాయిని భరత్ ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర యూత్ ఇంఛార్జి వెలకుర్తి నాగరాజు , గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షుడు కుళ్ళ సతీష్, యూత్ నాయకులు పగడాల భరత్, బీసీ నాయకులు అనిల్, కోటిశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ పై విద్యార్థులకు అవగాహన




**ఉప్పల్, మార్చ్ 21 (క్విక్ టుడే) :** విద్యార్థులకు ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని ఉప్పల్ లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉస్మానియా యూనివర్సిటీ ,ఎన్ఎస్ఎస్ వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జయంతి రెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ ఏవిధంగా సోకుతుంది,దానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనేక అంశాలపై అవగాహన విద్యార్థులకు కల్పించారు. ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం చాలా అవసరం అన్నారు. సెంట్ బాయ్స్ డిగ్రీ కాలేజ్, జి డి సి కళాశాల విద్యార్థులు సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డిప్యూటీ డైరెక్టర్ విపురి రవికుమార్,స్టేట్ యూత్ కోఆర్డినేటర్ జి రమేష్, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ ఆఫ్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ. సదిన్ సౌదా,ప్రో.నరసింహ రావు, రిసోర్స్ పర్సన్ టిఎన్ స్వామి, ఉప్పల్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు విశ్వనాధ్ కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జగన్, డాక్టర్ ప్రీతి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంటు అభ్యర్థిగా బూడిద బిక్షమయ్యకు అవకాశం కల్పించాలి



**గుండాల, క్విక్ టుడే,** భువనగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థిగా బూడిద భిక్షమయ్య గౌడ్ కు బీఆర్ఎస్ అధిష్టానం అవకాశం కల్పించాలని అంబాల ఎంపిటిసి పోన్నగాని మహేష్ కోరారు, బూడిద బిక్షమయ్య గౌడ్ కు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రజలతో మంచి సత్సంబంధాలు కలిగి ఉన్నాయి. ముఖ్యంగా భువనగిరి పార్లమెంట్ పరిధిలో భిక్షమయ్యగౌడ్ కు ప్రజల్లో మంచి స్పందన ఉన్నది. కావున బీఆర్ఎస్ అధిష్టానం భిక్షమయ్యకు భువనగిరి ఎంపీ టికెట్ కేటాయించాలి. అని బి ఆర్ ఎస్ అదిష్టానాన్ని బూడిద బిక్ష్మయ్య గౌడ్ కి టికెట్ ఇస్తే భువనగిరి పార్లమెంటు ఎలక్షన్ లో అదిక మెజార్టీతో గేలిపిస్తాం అని అన్నారు.

## ప్రభుత్వ అధ్యయనం పట్ల రాచప్ప సమితి హర్షం





**హైదరాబాద్, క్విక్ టుడే :** రాష్ట్రం లోనీ వివిధ ప్రదేశాల్లో లో నున్న ప్రకృతి అందాలు, కమనీయం, పర్యాటక అభివృద్ధి దిశలో రాష్ట్ర ప్రభుత్వ అధ్యయనం పట్ల రాచ కొండ పర్యావరణ, పర్యాటక, పరిరక్షణ సమితి హర్షం వ్యక్తం చేసింది, ఈ మేరకు విడుదల చేసిన ప్రకటన లో ప్రధాన సలహాదారులు కడారు అంజి రెడ్డి రాచ కొండ అందమైన, ప్రకృతి అందాలు,కమనీ యమైన, చక్కటి దృశ్యాల గల ప్రదేశమని పేర్కొంటూ, ప్రకృతి, పర్యాటక అభివృద్ధి కి చర్యలు నిమిత్తమై 15మంది అధికారులు గల సభ్యుల తో,చైర్మన్ గా అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వుంటారని రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని చెప్పారు, కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదం తెలిపిన భువన గిరి ఖిల్లా కు 56కోట్ల 81 లక్షలు మంజూరు చేయడం, రాచ కొండ ఖిల్లా కు కూడా ఈ మంజూరీ లో సమానంగా పంపిణీ చేసి న్యాయం చేయాలని తెలిపింది, చారిత్రక రాచ కొండ పర్యావరణ, పర్యాటక అభివృద్ధి కి అనువైనది, రాష్ట్రానికి తలమానికం మని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం రాచ కొండ కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలనివారు ప్రకటనలో వివరించారు,

# ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకలు

**మణుగూరు, ఏడుల్ల బయ్యారంలో నిర్వహించిన మానవహారం, ర్యాలీ ప్రదర్శనలు - ర్యాలీలో పాల్గొన్న అధికారులు ఎఫ్ డి ఓ రేంజర్, ఫారెస్టు సిబ్బంది**





**మణుగూరు మార్చి 21, క్విక్ టుడే :**
2012, నవంబర్ 28న యునెస్కో వారిచే తీర్మానించబడిన ప్రపంచ అడవి దినోత్సవాన్ని 2013 మార్చి 21న తొలిసారిగా వేడుకలను నిర్వహించుకునే విధంగా ప్రవేశపెట్టిందని మణుగూరు ఫారెస్ట్ డివిజనల్ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్ డి ఓ మాట్లాడుతూ.. అడువులే మనకు రక్షణ, అడువులే మనకు సంపద, ప్రాణవాయువునిచ్చే ది అడవులని ఉన్నారు. అదేవిధంగా మన ఊపిరి నిలిపే అడవులకు మనమిచ్చే బహుమతి కేవలం అడవులలో చెట్లు నరకకుండా వాటిని కాపాడుకోవడమే లక్ష్యంగా భావించి ప్రతి ఒక్కరు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా మణుగూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అడవి శాఖ అధికారులు, సిబ్బందితో మణుగూరు పట్టణం లోని అంబేద్కర్ సెంటర్ ప్రధాన రహదారి పై భారీ ర్యాలీ ప్రదర్శన మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న రేంజర్ ద్వాలియ మాట్లాడుతూ. ముందు తరాల వారికి అడవులు ప్రాముఖ్యత ప్రయోజనాల గురించి తెలియజేయడం లో భాగంగా ప్రతి సంవత్సరం మార్చి 21 రోజు ప్రపంచ అడవి దినోత్సవ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. సందర్భంగా మనం ప్రకృతిని నాశనం చేస్తే మనల్ని మనమే నాశనం చేసుకున్నట్లేనని అన్నారు.
కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు లక్ష్మయ్య, సలూజ, ముజుబుద్దిన్, రామచంద్రయ్య ,రాజు, రవి, శ్యామ్, శాంతి, వెంకటేశ్వర్లు, లక్పతి, మురళి కృష్ణ, లీల, సంధ్య, సరస్వతి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఎన్ ఎంల పెండింగ్ జీతాల కోసం నిరవధిక సమ్మె తప్పదు

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి**



**నల్లగొండ జిల్లా ప్రతినిధి. మార్చి 21.(క్విక్ టుడే ) :**
తెలంగాణ రాష్ట్రంలోని ఎన్ హెచ్ ఎమ్ స్కీంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ,కాంట్రాక్టు సిబ్బందికి పెండింగులో ఉన్న వేతనాలు, 7 నెలల పిఆర్సి ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డిహెచ్చరించారు.గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో . డి ఎం హెచ్ ఓ కార్యాలయంలోని సూపరిండెంట్ మంజులత కి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు నెలల వేతనాలు మరియు పిఆర్సి ఏరియర్స్ ఏడు నెలల డబ్బులు చెల్లించాలని అనేక రోజుల నుంచి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు ఈ నెల 22వ తేదీ లోపు వేతనాలు ఏరియర్స్ బకాయిలు చెల్లించకుంటే నిరవధిక సమ్మెలోకి వెళ్తామని అన్నారు ,ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం 1000 కోట్ల నిధులను వెంటనే ఇవ్వాలని అన్నారు, కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతోనే కార్మికులకు వేతనాలు అందించడం లేదని అన్నారు,ఎన్హెచ్ఎం స్కీంలో దాదాపు ఆల్ క్యాడర్స్ 2వ ఎఎన్ఎంలు, ఆర్బీఎస్కె డాక్టర్లు, ఎం.ఎల్.హెచ్.పిలు, అర్బన్ హెల్త్ సెంటర్ సి.ఓ., అకౌంటెంట్, ఎంఎన్ఏ, వాచ్మెన్ మరియు స్వీపర్, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్, స్టాఫ్ నర్సు, సపోర్టింగ్ స్టాఫ్, డిఇఓ, కాంటిజెంట్ వర్కర్స్, లాంటి దాదాపు 78 క్యాడర్లలలో సుమారు 17,514 మంది ఉద్యోగులు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానంలో గత అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని, ఈ ఉద్యోగులు నిత్యం క్రింది స్థాయి ప్రజానీకానికి అందుబాటులో ఉంటూ అనేక ప్రాంతాల నుండి విధులకు హాజరవుతుంటారని అన్నారు,కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరు పేద, మధ్య తరగతి చెందినవారు. ప్రతినెలా 1వ తేదీన జీతం అందితే తప్ప వారి కుటుంబాలు నడవని పరిస్థితి లేదు. గత 2నెలలుగా జీతాలు అందకపోవటంతో కార్మికుల పరిస్థితి దయానీయంగా ఉన్నదని,ఇంటి కిరాయిలు, పిల్లల ఫీజులు, కుటుంబ పోషణ కష్టంగా మారిందని,ఇట్టి విషయమై గతంలో అనేక సందర్భాలు తమరికి, జిల్లా స్థాయి అధికారులకు వినతులు ఇవ్వటం జరిగింది. కానీ నేటి వరకు ఒక్క నెల జీతాలు మాత్రమే చెల్లించారని అన్నారు.ఎన్హెచ్ఎం ఉద్యోగులకు పిఆర్సి విడుదలైన సందర్భంగా ఇవ్వవల్సిన 7 నెలల ఏరియర్స్ సైతం నేటికి కూడా చెల్లించలేదు. కావున ప్రతినెలా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి ఎన్హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉ ద్యోగులకు కూడా 1వ తేదీన జీతాలు అందే విధంగా తగు చర్యలు తీసుకోవటం ద్వారా ప్రజలకు మెరుగైనసేవలుఅందించటానికి అవకాశం ఉంటుంది. తక్షణం జీతాలు చెల్లించనిచో సమ్మె తప్పదని అన్నారు.ఈ కార్యక్రమంలో 2వ ఏఎన్ఎం యూనియన్ జిల్లా నాయకులు రాయల గీతా రాణి,చిత్రం సరిత, లెనిన్ తదితరులు పాల్గొన్నారు

# రైతులను మోసం చేసిన కాంగ్రెస్

**ఎస్సారెస్పీ ఫేస్ 2 ద్వారా నీళ్లు ఇస్తామంటేనే పంటలు వేశారు**
**హామీ ఇచ్చి పంటలకు నీరు ఇవ్వకుండా కాంగ్రెస్ రైతాంగాన్ని ముంచింది**
**ప్రభుత్వ అవగాహన రాహిత్యంతో రోడ్డున పడిన రైతులు**
**సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి, గుంతకండ్ల జగదీష్ రెడ్డి**





**నల్లగొండ జిల్లా ప్రతినిధి. మార్చి 21.( క్విక్ టుడే) :**
కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎస్సారెస్పీ ఫేస్ 2 ద్వారా నీళ్లు ఇస్తామంటేనే పంటలు వేశారని, హామీ ఇచ్చి పంటలకు నీరు ఇవ్వ కుండా కాంగ్రెస్ రైతాంగాన్ని మోసం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మండి పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఒక్కో రైతు 30 వేల పెట్టుబడిపెట్టి ఆగమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభు త్వం అవగాహన రాహిత్యం వలన రైతులు రోడ్డున పడ్డారని విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో రైతుల కోరిక మేరకు వరుసగా ఐదో రోజు కరువుతో ఎండిన పంటలను మంత్రి జగదీశ్వర్ రెడ్డి పరిశీ లించారు. గురువారం సూర్యా పేట మండలం యార్కారం, దుబ్బ తండ, రెఖ్యా నాయక్ తండాలో ఎండిన పొలాల పరిశీలించారు. రైతుల సమస్య లను అడిగి తెలుసుకున్న జగదీష్ రెడ్డి ప్రభుత్వమే మాట ఇచ్చి ప్రజ లను మోసం చేసిన ఘటన చరిత్రలో ఏనాడు లేద ని, మాట ఇచ్చి రైతన్నల నడ్డివిరిచిన అపకీర్తి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కింద ని మండిపడ్డారు.మా ప్రభుత్వం హయాంలో మొన్నటి వరకు జాలువారిన పంట పొలాలు నేడు మోడువారడానికి కారణం నూటి కి నూరు శాతం ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. పోరాడి సాధించిన తె లంగాణ లో కేసీఆర్ రైతాంగాన్ని సస్యశ్యామ లం చేస్తే మూడు నెల ల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేసిందన్నారు. కాలేశ్వరం నీళ్లు ఎత్తి పోయడానికి మూడు పిల్లర్ల కుంగుబాటుకు సంబంధం లేనప్పటికీ గత ప్రభు త్వాన్ని అభాసు పాలు చేసేందుకు రైతాంగానికి నీళ్లు ఇవ్వడం లేద న్నారు. రైతుబంధు రాలేదని ప్రశ్నించిన రైతును మంత్రి చెప్పుతీసుకొని కొడతాననడం దుర్మార్గం అ న్నారు.మా ప్రభుత్వ హయాంలో రైతు తప్పిదం వలన ఒక్క మడి ఎండిపో తేనే నాన్న హంగామా చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇప్పుడు ఏం సమాధానం చెబు తారని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తం గా పంట పొలా లు ఎండి పోతున్న ప్పటికీ మంత్రులు కనీసం సమీక్ష చేయక పోవడం రైతుల పట్ల ప్రభు త్వానికి ఉన్న మొసలి కన్నీళ్ళకు నిదర్శ నమన్నారు. పంట నష్టం పై మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి రైతులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## రోడ్డు ప్రమాదంలో చెరుకుపల్లి శ్రీకాంత్ మృతి

**నల్లగొండ జిల్లా ప్రతినిధి. మార్చి 21. (క్విక్ టుడే) :**

చెరుకుపల్లి శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తిప్పర్తి ఎస్సై రాజు చెప్పిన వివరాల ప్రకారం చెరుకుపల్లి శ్రీకాంత్ తండ్రి సుదర్శన్. గ్రామం మండలం తిప్పర్తి, తిప్పర్తి పోలీస్ స్టేషన్లో ప్రవేటు పనులు చేస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నాడు. తిప్పర్తి నుండి నల్లగొండకు వస్తున్న క్రమంలో దుప్పలపల్లి వద్ద వెనుకనుండి కంటైనర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. చెరుకుపల్లి శ్రీకాంత్ ఢీకొట్టిన కంటైనర్ రామోజీ ఫిలిం సిటీ వద్ద పోలీసులు గుర్తించినట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వెల్లడించారు.

# ఇల్లందు, టేకులపల్లిలో నాలుగు వైన్‌షాప్‌లు లూటీ

**అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని పట్టపగలు గ్రామస్తుల దాడి**





**ఇల్లందు, టేకులపల్లి మార్చి 21, క్విక్ టుడే :** అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని తెలిసి స్థానిక మహిళలు, గ్రామస్తులు నాలుగు వైన్ షాపులపై గురువారం దాడి చేసి చేశారు. వైన్ షాపులో ఉన్న మద్యాన్ని మొత్తం ఎత్తుకెళ్ళిపోయారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గం లోని ఇల్లందు, టేకులపల్లి సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న నాలుగు మద్యం షాపుల్లో పేరొందిన బ్రాండ్లు బెల్ట్ షాపులకే యజమానులు విక్రయిస్తన్నారు. ఇవి అందుబాటులో లేకుండా కేవలం బెల్ట్ షాపు వారికే మద్యం షాపు యజమానులు విక్రయిస్తున్నారు. ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి 30 అధికంగా వసూలు చేస్తున్నారు. దీంతో స్థానికులు ఆగ్రహించి మహిళలు, గ్రామస్తులు మూకుమ్మడిగా పట్టపగలు వైన్ షాపులపై దాడి చేసి, మద్యం స్టాక్ మొత్తం ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న కొంతసేపటికి టేకులపల్లి పోలీసులు లూటీ జరిగిన షాపులను పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# పానగల్ కు చెందిన పి ఈ టి సాజిద్ మృతదేహానికి నివాళులు

**సాజిద్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, మార్చి 21.(క్విక్ టుడే) :** నల్లగొండ పట్టణం పానగల్ 2వ వార్డు కు చెందిన పి ఈ టి సాజిద్ నిన్న రాత్రి కనగల్ లో రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు మృతి చెందాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు భవనాల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించినారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎంబీబీఎస్ చదువుతున్న వారి కూతురుకి ఆర్థిక సహాయం అందిస్తానని, వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కౌన్సిలర్ లు సమాద్, ఇబ్రహీం, బాబా, ఖలీల్, బుర్రి యాదయ్య, పాల్గొన్నారు.

# మునుగోడు నాయకులు బిజెపిలో చేరిక



**నల్లగొండ. మార్చి 21. (క్విక్ టుడే) :** మునుగోడు నియోజకవర్గం,మునుగోడు మండలానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు పందుల రాములు, నాగరాజు ల తో పాటు 50 మంది బిజెపిలో చేరారు. బిజెపి భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి. మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ పార్టీ కండువా కప్పి బిజెపి కుటుంబంలోకి సాధారంగా ఆహ్వానించారు . ఈ సందర్భంగా భువనగిరి బిజెపి పార్లమెంట్ అభ్యర్థి బూర నరసయ్య గౌడ్ మాట్లాడుతూ బిజెపి బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. దేశ ప్రధాని ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు వార్డు, వార్డు, నా గ్రామ, గ్రామన, ప్రజలకు వివరించాలని కోరారు.

# ఏడేండ్ల నాటి కేసులో పార్టీ ఖాతాను ప్రీజ్ చేశారు : కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బ తీసేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నాయని కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఆరోపించారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ ఖాతాలపై నరేంద్ర మోదీ ప్రభుత్వ దాడి కాదని భారత ప్రజాస్వామ్యంపై దాడని ఆయ న అభివర్ణి చారు. తాము రానున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేసుకోవాల్సి ఉండగా, ఇప్పుడు తమ ఖాతాలను నిలిపివేశారని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల తేదీలు ప్రకటించినా తాము బ్యాంకులో ఉన్న రూ. 285 కోట్లను వినియోగించుకోలేక పోతున్నామని అన్నారు. ప్రచారం కోసం తాము వార్తాపత్రికల్లో, టీవీ ఛానెళ్లలో ప్రకటనల స్లాట్స్‌ను బుక్ చేసుకోవాలని, పోస్టర్లు ముద్రించాల్సి ఉందని చెప్పుకొచ్చారు. తాము ఈ పనులు చేసుకోలేకుంటే ఇక ప్రజాస్వామ్య మనుగడ ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు.

ఏడేండ్ల నాటి కేసులో పార్టీకి నోటీసులు జారీ చేశారని అన్నారు. 2017-18 నాటి కేసుకు సంబంధించి ఆదాయ పన్ను శాఖ ఇప్పుడు తమ పార్టీ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసిందని అన్నారు. సీతారాం కేసరి హయాంలో 1994-95 అసెస్‌మెంట్ నోటీస్ ఇప్పుడు తమకు జారీ చేశారని తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వం భవిష్యత్‌లోనూ తమను వేధిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# అడవితల్లిని అమ్మకన్నా మిన్నగా కాస్తున్న స్త్రీమూర్తులు



**హైదరాబాద్ :** 'అ.. అమ్మ! తర్వాత ఆ.. ఆవు!' అనే చాలామందికి తెలుసు. కొందరు మాత్రమే.. అమ్మ తర్వాత అమ్మలాంటి 'అడవి' అని అక్షరాలు దిద్దుతారు. ఆ పదాన్ని అక్కడితో మర్చిపోరు. ఎక్కడికి వెళ్లినా తలుచుకుంటారు. తమ చుట్టూ పచ్చగా ఉండాలని భావిస్తారు. అడవిని ఆడపడుచుగా గౌరవిస్తారు. ఆమెకు మొక్కలు చదివిస్తూ ఆలనా పాలనా చూస్తారు. అలాంటి వాళ్లే ఈ స్త్రీమూర్తులు. కుంచించు కుపో తున్న అడవులను చూసి చింతించి ఊరుకోకుండా.. తమవంతుగా చెట్లు నాటుతూ పచ్చదనం పెంచుతున్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా అడవితల్లిని అమ్మకన్నా మిన్నగా కాస్తున్న ఈ స్త్రీమూర్తుల కథలు తలుచు కుందాం ఐదువేల చెట్లకు అమ్మపడమటి కనుమల్లో మరింత పచ్చగా ఉంటుంది కేరళ. ఆ రాష్ట్రంలోని అలెప్పి జిల్లా ముత్తుకుళం గ్రామంలో 1934లో జన్మించింది కొల్లక్కయిల్ దేవకి. బాల్యంలో తాత చెప్పిన అన్ని కథలూ అడవి చుట్టూ తిరిగేవి. దీంతో ఆమెకు వనమెంతో ఘనంగా కనిపించేది. దేవకి వివాహం గోపాలకృష్ణ అయ్యర్‌తో జరిగింది. అతను ఇంగ్లిష్ టీచర్. వారసత్వంగా వాళ్లకు ఐదెకరాల పొలం వచ్చింది.చిన్నప్పటి నుంచి వ్యవసాయం చేసిన అనుభవం ఉండటంతో పెండ్లయ్యాక సాగు కొనసాగించింది. అయితే ఓ ప్రమాదంలో ఆమె కాళ్లు దెబ్బతిన్నాయి. కొన్నాళ్లకు కోలుకున్నప్పటికీ మునుపటిలా 'పొలం పని చేయలేన'ని దేవకికి అర్థమైంది. బాల్యం నుంచి తన మనోఫలకంపై చిత్రించుకున్న వనాన్ని తన చేనులో కొలువుదీర్చాలని భావించింది. ఆనాటి నుంచి మొక్కలు నాటడం పనిగా పెట్టుకుంది. అప్పుడు ఆమె వయసు నలభై ఏండ్లు! రకరకాల మొక్కలు పెరిగి పెద్దవడంతో కొన్నేండ్లలో దేవకి సాగుభూమి దట్టమైన వనమైంది. ఇందులో వేప, చింత, రావి తదితర జాతుల వృక్షాలు ఉన్నాయి. ఇప్పుడు దేవకీ అమ్మ వయసు 90 ఏండ్లు. ఆమె పెంచి పోషిస్తున్న చెట్ల వయసు ఆమె వయసులో సగం! ఎన్నెన్నో పురస్కారాలు ఆమెను వెతుక్కుంటూ వచ్చి వరించాయి. రాష్ట్రపతి చేతుల మీదుగా 'నారీశక్తి' అవార్డునూ అందుకున్నది. అవేం ఆమెకు అంతగా పట్టవు! పెందరాళే లేచి%ొూ% అడవికి వెళ్లి.. తన బిడ్డలను చూసుకోవడమే ఆమెకు అసలు తృప్తి!తులసి వనంపొడవైన సముద్ర తీరమున్న కర్ణాటకలో అడవులూ ఎక్కువే! అలాంటి చిక్కటి అటవీ ప్రాంతంలో జన్మించింది తులసి గౌడ. ఆమె చిన్నప్పుడే తండ్రిని కోల్పోయింది. బడి ముఖం చూసింది లేదు. అడవే ఆమెకు పాఠశాల అయింది. చిన్నప్పుడు ఇంటి పరిసరాల్లో తులసి రకరకాల చెట్ల విత్తనాలు చల్లుతూ ఉండేది. స్థానికంగా ఉండే అటవీశాఖ అధికారుల దగ్గర సహాయకురాలిగా ఉండేది. వాళ్లు డ్యూటీ ఏం చేసేవారో తెలియదు కానీ, తులసి మాత్రం మొక్కలు నాటడమే దినచర్యగా మార్చుకుంది. ఆమె ఉత్సాహాన్ని గమనించిన అటవీశాఖ అధికారులు తులసికి 'వనమాలి' ఉద్యోగాన్ని ఇచ్చారు. కొత్తగా రెక్కలు తొడిగినట్లయింది. వనమంతా విహరిస్తూ ఖాళీ ప్రదేశం కనిపిస్తే చాలు మొక్కలు నాటేది. అలా నాటి వదిలేయకుండా.. అవి వేళ్లూనుకునేదాకా రక్షణ చర్యలు చేపట్టేది. ఏకంగా 30వేల మొక్కలు నాటి పశ్చిమ కనుమలకు పచ్చని కానుకను సమర్పించింది. 'వృక్షలక్ష్మి'గా పేరు తెచ్చుకుంది. వన విస్తరణకు ఆమె చేసిన కృషికిగాను ఎన్నో అవార్డులు అందుకుంది. రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం పొందారు.వనప్రభజిఅడవికి, ఆవిడకు అవినాభావ సంబంధం. ప్రభాదేవిది ఉత్తరాఖండ్‌లోని కుగ్రామం. పచ్చదనంలోనే ఆమె బాల్యమంతా సాగింది. బాల్యంలో ఊయలలూగిన తరులు.. పెద్దయ్యేసరికి కనిపించకుండా పోయాయి. ఇంటి వసారాలోంచి కనుచూపు మేరలో కను విందు చేసే పచ్చదనం తను ఎదిగేకొద్దీ తగ్గుతూ పోయింది. తన అడుగులకు మడుగులొత్తిన అడవితల్లి ఎందుకో బక్కచిక్కిపోయిందని అనుకునేది! పెద్దయ్యాక వనదేవతను కబళిస్తున్నది మనుషులేనని తెలిసి బాధపడింది. ఆమె మాత్రం ఏం చేయగలదు! కూలిపోతున్న చెట్లను చూసినప్పుడల్లా దిగాలుగా ముఖం పెట్టడం తప్ప! అభివృద్ధి పేరుతో విస్తరిస్తున్న కాంక్రీట్ జంగిల్‌ను చూసి మనిషిగా పుట్టినందుకు సిగ్గుపడటం తప్ప!! రోజులు గడిచిపోయాయి.. పర్యాటక కేంద్రంగా విస్తరించే కొద్దీ ఉత్తరాఖండ్‌లో అటవీ విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. రుద్రప్రయాగ జిల్లాలోని ప్రభాదేవి వాళ్ల గ్రామం సమీపంలోనూ ఇదే ధోరణి. అప్పటికే ఆమెకు పెండ్లయింది. ఊరికి అల్లంత దూరంలో వారికి కొంత పొలం ఉంది. అక్కడ మరో అడవికి జన్మనివ్వాలని ఆ ఆడకూతురు నిశ్చయించుకుంది. భర్తకు చెబితే సరేనన్నాడు. ఓ రోజు వెళ్లి కొన్ని మొక్కలు నాటింది. ఆ తర్వాతి రోజు మరికొన్ని నాటింది. అప్పట్నుంచి అదేపని! మొక్కలే ఆమె లోకమయ్యాయి. ఇంటిపట్టున విశ్రాంతి తీసుకునే వయసులో మొక్కల సంరక్షణ భుజానికెత్తుకుంది. చూస్తుండగానే ఆ మొక్కలు చెట్లయ్యాయి, మానులయ్యాయి. 500 చెట్లు.. అడవితల్లి సిగలో పచ్చల పతకంగా ఇప్పుడు మెరిసిపోతున్నాయి. 80 ఏండ్ల వయసులోనూ నిత్యం తమను పలకరించడానికి వస్తున్న ప్రభాదేవి ఆ మానులకు అమ్మ కన్నా ఎక్కువంటే ఎవరు కాదనగలరు?అభివందనం..హిమాలయ పర్వత పాదాల దగ్గరున్న డూన్ లోయ వందనా శివ జన్మస్థలం. ఆమె బాల్యమంతా మంచుకొండలను చూస్తూ గడిచిపోయింది. హిమగిరుల నుంచి వీచే గాలి పైన్ చెట్ల మీదుగా తనను తాకినప్పుడు పులకించిపోయేది. 1970లో మొదలైన చిప్కో ఉద్యమం నాటికి వందన యువతి. కుంచించుకుపోతున్న హిమాలయ అడవులపై గడ్వాల్ వాసులు ఎత్తిన పిడికిళ్లలో ఆమె చేయీ ఉన్నది. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఆమెకు మరింత బలాన్నిచ్చింది. సహజంగా ఉన్న ధైర్య స్వభావం ప్రకృతి ప్రేమికురాలిని కాస్తా.. పర్యావరణవేత్తగా, ఉద్యమకారిణిగా తీర్చిదిద్దింది. ప్రభుత్వాలు వన సంరక్షణ చర్యలు తీసుకునేలా ఎన్నో ఉద్యమాలు చేపట్టింది. 'నవధాన్య' సంస్థను స్థాపించి తన పోరాటాన్ని వివిధ రంగాలకు విస్తరించింది. స్త్రీ సాధికారత, సుస్థిర వ్యవసాయ విధానాలతోపాటు అటవీ సంరక్షణ చేస్తున్నది.

# గురుకులాల్లో విద్యార్థుల ఘర్షణ.. జూనియర్లు, సీనియర్లంటూ పరస్పర దాడులు

**ఎనిమిదో తరగతి విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి**

**కొత్తకోటలో మాట వినడం లేదని విద్యార్థుల గొడవ**


**ఆర్సీవో విచారణ.. పది రోజులపాటు నలుగురి సస్పెండ్**



**న్యూఢిల్లీ :** గురుకుల పాఠశాలల్లో కలిసిమెలిసి ఉండాల్సిన విద్యార్థులు తరచూ ఘర్షణలకు దిగుతు న్నారు. జూనియర్లు, సీనియర్లు అనే భావన తీసుకొచ్చి దాడులకు దిగుతున్నారు. మాట వినడం లేదన్న కోపంతో మితిమీరి ప్రవర్తిస్తున్నారు. అందుకు.. జగిత్యాల, వనపర్తి జిల్లాల్లోని గురుకుల పాఠశాలల్లో వారం రోజుల కిందట జరిగిన గొడవలే నిదర్శనం. తల్లిదండ్రుల చొరవతో ఈ రెండు చోట్ల జరిగిన ఘటనలు ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చాయి. జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం గుంజపడుగుకు చెందిన పస్తం లత-కనకయ్య కొడుకు రిషి (13) వెల్గటూర్ మండలం స్తంభంపల్లి బీసీ గురుకులంలో 8వ తరగతి చదువుతున్నాడు. తన పుట్టిన రోజున రిషి డ్రెస్ దొంగిలించాడని తోటి విద్యార్థి రాము జనవరి 9న 9, 10వ తరగతి చదువుతున్న అభినయ్, శ్రీహర్ష, శ్రీకాంత్‌కు చెప్పాడు. అదే రోజు రాత్రి ఆ ముగ్గురు డ్రెస్ గురించి రిషిని అడిగారు.తనకేం తెలియదని చెప్పినా వినకుండా పరీక్ష ప్యాడ్‌లతో తలపై గట్టిగా కొట్టగా తలకు తీవ్రగాయమైంది. ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే.. బిల్డింగ్‌పై నుంచి తోసేస్తామని బెదిరించడంతో రిషి ఎవరికీ చెప్పలేదు. కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురవుతుండటంతో తల్లిదండ్రులు హాస్టల్ నుంచి ఇంటికి తీసుకెళ్లి తరచూ దవాఖానల్లో చూపించారు. అయినా తగ్గకపోవడంతో మూడు రోజుల క్రితం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ వైద్యుడికి చూపించగా, వైద్యుడి సలహా మేరకు ఎంఆర్ఐ తీయించారు. తలకు బలమైన గాయం కావడంతో మెదడులో రక్తం గడ్డ కట్టినట్టు వైద్యులు గుర్తించారు. దీంతో తల్లిదండ్రులు రిషిని నిలదీయగా.. అసలు విషయం చెప్పాడు. ఆగ్రహించిన తల్లిదండ్రులు, బంధువులు బుధవారం గురుకులానికి చేరుకొని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని తల్లిదండ్రులను సముదాయించారు.వనపర్తి జిల్లాలో..కొత్తకోట పట్టణ సమీపంలోని సాంఘిక సంక్షేమ (వీపనగండ్ల) గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులపై 9వ తరగతి స్టూడెంట్స్ కొన్ని రోజులుగా దాడికి పాల్పడుతున్నారు. జూనియర్స్ చెప్పిన మాట వినడం లేదని తరచూ కర్రలతో దాడి చేస్తున్నా.. బాధిత విద్యార్థులు ఎవరికీ చెప్పలేదు. రెండు రోజుల క్రితం 9వ తరగతి చదువుతున్న హర్ష, శివాజీ, కేతన్, ప్రసాద్ 8వ తరగతి విద్యార్థుల వీపులపై కర్రలతో దాడి చేయగా వాతలు పడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బుధవారం పాఠశాలకు చేరుకొని ప్రిన్సిపాల్ దయాకర్‌ను నిలదీశారు. ఆర్సీవో విద్యులతకు సమాచారం అందించగా.. పాఠశాలకు చేరుకొని విద్యార్థులను విచారించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడి చేసిన నలుగురు విద్యార్థులను పది రోజులపాటు సస్పెండ్ చేశారు.

# కిడ్నాప్ డ్రామా ఆడిన యువతి..


**బంధించిన ఫొటోలు పంపి తండ్రి నుంచి రూ.30 లక్షలు డిమాండ్**



**మధ్యప్రదేశ్ :** చేతులు, కాళ్లు తాడుతో కట్టేసి ఉన్న ఫొటోలు తండ్రి మొబైల్‌కు పంపింది. విడిపించేందుకు రూ.30 లక్షలు డిమాండ్ చేసింది. తండ్రి ఫిర్యాదుతో దర్యాప్తు చేసిన పోలీసులు నకిలీ కిడ్నాప్ వ్యవహారాన్ని బయటపెట్టారు. మధ్యప్రదేశ్‌లోని శివపురికి చెందిన 21 ఏళ్ల కావ్యకు పోటీ పరీక్షల్లో శిక్షణ ఇచ్చేందుకు రాజస్థాన్ కోటాలోని కోచింగ్ సెంటర్‌లో తల్లిదండ్రులు చేర్పించారు. కుమార్తెతో పాటు మూడు రోజులు హాస్టల్‌లో ఉన్న ఆమె తల్లి తిరిగి మధ్యప్రదేశ్‌లోని సొంత ఊరికి వెళ్లిపోయింది.కాగా, కావ్య తన స్నేహితులతో కలిసి విదేశాలకు వెళ్లి అక్కడ చదువుకోవాలని భావించింది. తల్లి వెళ్లిన తర్వాత మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చేరుకుంది. ఇద్దరు మగ స్నేహితులతో కలిసి ఒక రూమ్‌లో ఉంటున్నది. అయితే కోటాలో ఉండి అక్కడ చదువుకుంటున్నట్లుగా తల్లిదండ్రులను నమ్మించింది. పరీక్షలకు సంబంధించిన మార్కుల వివరాలు కూడా పేరెంట్స్ మొబైల్‌కు పంపింది.మరోవైపు మార్చి 18న కావ్య తండ్రి మొబైల్ ఫోన్‌కు కొన్ని ఫొటోలు వచ్చాయి. అతడి కుమార్తెను తాళ్లతో బంధించి కిడ్నిప్ చేసినట్లు మెసేజ్‌లో ఉంది. ఆమెను విడిపించేందుకు రూ.30 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో ఆందోళన చెందిన కావ్య తండ్రి హుటాహుటిన కోటా వెళ్లాడు. కుమార్తె కిడ్నాప్ గురించి అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.కాగా, దర్యాప్తు చేసిన కోటా పోలీసులు కావ్య మూడు రోజుల్లోనే అక్కడి నుంచి ఇండోర్‌కు వెళ్లినట్లు గుర్తించారు. ఇద్దరు మగ స్నేహితులతో కలిసి ఉన్నట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా తెలుసుకున్నారు.

ఆమె స్నేహితురాలిని ప్రశ్నించిన త ర్వాత కావ్య కిడ్నాప్ నకిలీ అని నిర్ధారించారు. స్నేహితులతో కలిసి విదేశాల్లో చదువుకునేందుకు కిడ్నాప్ డ్రామా ఆడినట్లు తెలుసుకున్నారు.

# హైకోర్టులో ప్రణీత్‌రావుకు చుక్కెదురు..




**హైదరాబాద్:** ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ డీఎస్పీ ప్రణీత్‌రావుకు హైకోర్టులో చుక్కెదురైంది. తనను పోలీసు కస్టడీకి అప్పగిస్తూ నాంపల్లి కోర్టు జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో కింది కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ జీ రాధారాణి తీర్పు వెలువరించారు. కాగా, ప్రణీత్‌రావు పిటిషన్‌పై బుధవారం వాదనలు ముగియగా, తీర్పును నేటికి రిజర్వు చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదన వినిపిస్తూ.. ఈ కేసుకు సంబంధించిన వాస్తవాలను కింది కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని, నిబంధనలకు విరుద్ధంగా ప్రణీత్‌ను పోలీస్ కస్టీకి అప్పగించిందని తెలిపారు. కస్టడీకి సంబంధించిన నిబంధనలను పోలీసులు పాటించడం లేదని, కార్యాలయ పనివేళల్లో కాకుండా ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు ప్రణీత్‌ను విచారిస్తున్నారని, విరామం లేకుండా 12 గంటలపాటు విచారణ జరపడం చట్ట వ్యతిరేకమని వివరించారు.

ఈ విచారణకు ప్రణీత్ బంధువులను, న్యాయవాదిని అనుమతించడం లేదని, దర్యాప్తునకు సంబంధించిన అంశాలను పోలీసులు ఉద్దేశపూర్వకంగా మీడియాకు లీక్ చేసి ప్రణీత్ పరువుకు భంగం కలిగిస్తున్నారని తెలిపారు. పోలీసుల కస్టడీ, దర్యాప్తు నిర్దిష్ట ప్రదేశంలో జరిగేలా చూడాలని, ఇంటరాగేషన్‌లో ఏఎస్పీ డీ రమేశ్ పాల్గొనకుండా కట్టడి చేయాలని కోరారు. అనంతరం పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదిస్తూ.. ప్రణీత్‌రావుపై దర్యాప్తు చట్ట ప్రకారమే జరుగుతున్నదని, విచారణ సమయంలో పోలీసులు ఆయన న్యాయవాదులను అనుమతిస్తున్నారని తెలిపారు. ప్రణీత్ తన న్యాయవాది ఫోన్ నుంచే తల్లిదండ్రులతో మాట్లాడుతున్నాడని చెప్పారు. పిటిషనర్ నుంచి కీలక విషయాలను రాబట్టాల్సి ఉన్నందున పోలీస్ కస్టడీ యథావిధిగా కొనసాగించాలని కోరారు.

# ఏప్రిల్ 8న సంపూర్ణ సూర్యగ్రహణం..

# ఆ దేశంలో అంధకారం

**న్యూయార్క్:** వచ్చే నెల 8న ఖగోళంలో అద్భుతం జరుగనుంది. ఈ ఏడాది మొదటి సంపూర్ణ సూర్యగ్రహణం ఆ రోజున సంభవించనుంది. సాధారణంగా భూమికి సూర్యుడికి మధ్య చంద్రుడు వచ్చినప్పుడు సూర్యగ్రహణం ఏర్పడుతుంది. అప్పుడు కొంత సమయం చీకటిగా మారుతుంది. అయితే భూమి, సూర్యునికి మధ్య వచ్చిన చంద్రుడు వృత్తాకారం సూర్యుడిని పూర్తిగా కప్పేస్తే సంపూర్ణ సూర్యగ్రహణం సంభవిస్తుంది. దీనికారణంగా సూర్యుని కిరణాలు భూమిని చేరుకోలేవు. దీంతో కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా అంధకారం ఏర్పడుం ది. ఏప్రిల్ 8న రానున్న సూర్యగ్రహణం వల్ల అమెరికాలోని చాలా ప్రాంతాల్లో చీకటి కమ్ముకోనుంది. దీంతో వందలాది స్కూళ్లకు ఇప్పటికే సెలవులు ప్రకటించారు. గతేడాది అక్టోబర్ 14న ఏర్పడిన రింగ్ ఆఫ్ ఫైర్ తర్వాత వస్తున్న ఈ సంపూర్ణ సూర్య గ్రహణాన్ని వీక్షించడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. మెక్సికోలో ప్రారంభం కానున్న సంపూర్ణ సూర్యగ్రహణం.. అమెరికాలోని టెక్సాస్, ఓక్లాహోమా, అర్కాన్‌సాస్, మిస్సోరి, ఇల్లినాయిస్, కెంటకీ, ఇండియానా, ఒహియో, పెన్సిల్వేనియా,



న్యూయార్క్, వెర్మాంట్, న్యూ హ్యాంప్‌షైర్, మైన్ రాష్ట్రాల మీదుగా కెనడాకు తరలనుంది. దీంతో ఈ రాష్ట్రాల్లో గ్రహణ సమయంలో పూర్తిగా చీకట్లు కమ్ముకోనున్నాయి. అదేవిధంగా టెన్నెస్సీ, మిచిగాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో సంపూర్ణ సూర్యగ్రహణం కనువిందు చేయనుంది. సుదీర్ఘ సూర్యగ్రహణం..గత 50 ఏళ్లలో ఇదే సుదీర్ఘ సూర్యగ్రహణం. భారత కాలమానం ప్రకారం ఏప్రిల్ 8న తేదీ అమావాస్య తిధి రాత్రి 9.12 గంటలకు సూర్యగ్రహణం ప్రారంభమై తెల్లవారు జామున 1.25 గంటలకు ముగియనుంది. అంటే ఈ గ్రహణం మొత్తం సమయం 4 గంటల 39 నిమిషాల పాటు ఉండనుంది. దీంతో ఏప్రిల్ 8న సంభవించే సూర్యగ్రహణం ఈ సంవత్సరంలోనే అత్యంత సుదీర్ఘమైన సూర్యగ్రహణం అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతేకాదు సంపూర్ణ సూర్యగ్రహణ అద్భుతమైన దృశ్యం 50 సంవత్సరాల క్రితం కనిపించింది. ఇప్పుడు ప్రజలు ఈ సంవత్సరం మళ్లీ చూడగలరని అంటున్నారు. అయితే ఇది భారత్‌లో కనిపించదు. రింగ్ ఆఫ్ ఫైర్‌గతేడాది అక్టోబర్ 14న ఏర్పడిన సంపూర్ణ సూర్యగ్రహణానికి ఓ ప్రత్యేకత ఉంది. సూర్యగ్రహణం సమయంలో అత్యంత అరుదుగా ఏర్పడే 'రింగ్ ఆఫ్ ఫైర్' (ఉంగరం ఆకృతిలో సూర్య వలయం) ఆకాశంలో ఆవిష్కృతమైంది. ఇది అమెరికా,

మెక్సికో సహా దక్షిణ, మధ్య అమెరికాలోని పలు దేశాల్లో మాత్రమే కనపడింది. ఈ దేశాల్లో 'రింగ్ ఆఫ్ ఫైర్' చివరిసారి 2012లో కనిపించగా, తర్వాత 2046లో రానుంది.

# ఒక్క చెక్కు ఎమ్మెల్యే చేతికి పోయినా బాగుండదు..

## మరో వివాదంలో మంత్రి పొన్నం మంత్రి పొన్నం

**హైదరాబాద్ :** మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా మరో వివాదంలో ఇరుక్కున్నారు. రెండు నెలల క్రితం ఓ అధికారితో మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన ఫోన్ సంభాషణ వాయిస్ రికార్డు లీక్ కావడం కలకలం సృష్టించింది. మంత్రి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయినప్పటికీ, ఆ విషయాన్ని పక్కన పెట్టి తన మాటలను రికార్డు చేసి లీక్ చేసిన అప్పటి హనుమకొండ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని మంత్రి కోరడం చర్చనీయాంశంగా మారింది. ఐదు రోజులుగా ఇది సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై మంత్రి తీవ్రంగా స్పందించి సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఫిర్యాదు చేశారు. ఫోన్ సంభాషణ ఇలా.. 'గత ప్రభుత్వంలో




హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్ ఉంటే అధికార పార్టీ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయించిండ్రు. ఇప్పుడు కౌశిక్‌రెడ్డి అధికార పార్టీ ఎమ్మెల్యే కాదు. మా కంటెస్ట్ అభ్యర్థి ప్రణవ్ చేతుల మీదుగా లేదా ప్రొటోకాల్ కాదంటే అధికారులే నేరుగా వెళ్లి లబ్ధిదారులకు చెక్కులు అందజేయాలి. ఒక్క చెక్కు ఎమ్మెల్యే చేతికి పోయినా బాగుండదు' అని మంత్రి పొన్నం అప్పటి హనుమకొండ ఆర్డీవో, కమలాపూర్ తహసీల్దార్ మాధవికి హుకుం జారీ చేసిన ఆడియో వైరల్ అయ్యింది.

దీంతో తన ఫోన్ వాయిస్‌కాల్ రికార్డును లీక్ చేసిన హనుమకొండ ఆర్డీవో (ప్రస్తుతం బదిలీ అయ్యారు)పై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు మంత్రి ఫిర్యాదు చేశారు. ఆర్డీవోపై ఫిర్యాదు విషయాన్ని మంత్రి పొన్నం బుధ:వారం గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ప్రస్తావించారు.

# అరుణాచల్ భారత్‌లో అంతర్భాభాగమే..

# చైనాకు తేల్చిచెప్పిన అమెరికా అరుణాచల్ ప్రదేశ్‌లో

**వాషింగ్టన్:** అరుణాచల్ ప్రదేశ్‌లో భారత్‌లో భాగమేనని అమెరికా మరోసారి స్పష్టం చేసింది. అరుణాచల్‌ను తాము భారత భూభాగంగా గుర్తిస్తున్నామని వెల్లడించింది. అరుణాల్‌ను దక్షిణ టిబెట్‌గా (జాంగ్నాన్) అభివర్ణిస్తున్న చైనా.. అది తమదేనంటూ ఆ దేశ సైన్యం ఇటీవల ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అరుణాచల్ భారత్‌లో అంతర్భాగంగా వాషింగ్టన్ గుర్తిస్తున్నదని అమెరికా రక్షణ శాఖ డిప్యూటీ అధికార ప్రతినిధి వేదాంత్ పటేల్ ప్రకటించారు. సైన్యం లేదా పౌరులు వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) అవతల ఆక్రమణలకు పాల్పడటానికి ఎలాంటి ప్రయత్నాలు చేసినా తాము



దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు. అరుణాచల్ ప్రదేశ్ తమదేనంటూ మొండిగా వ్యవహరిస్తూ వస్తున్న చైనా.. తన వక్రబుద్ధిని బయటపెట్టింది. ఇటీవల ప్రధాని మోదీ సేలా సొరంగ మార్గాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిపై చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అభ్యంతరం వ్యక్తంచేసింది. జాంగ్నాన్ తమదేని, సేలా సొరంగాన్ని భారత్ చట్టవిరుద్ధంగా స్థాపించిందంటూ రక్షణ శాఖ అధికార ప్రతినిధి సీనియర్ కల్నల్ జాంగ్ షియాగాంగ్ గత శుక్రవారం వ్యాఖ్యానించారు. అయితే దీనిపై భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. చైనా ప్రకటన అసంబద్ధమైనదని, అరుణాచల్ స్పష్టం చేసింది.

## ది అదర్ సైడ్.. పాకప్రవీణుల చరితం



**హైదరాబాద్ :** ఇండ్లల్లో వంట చేసేవారిలో మహిళలే ఎక్కువ! కానీ బయట ఫుడ్ ఇండస్ట్రీలో మాత్రం పురుషుల ఆధిపత్యమే ఎక్కువగా కనిపిస్తుంది. టీ మాస్టర్ నుంచి బిరాన్యీ మేకర్‌వరకు సింహభాగం వాళ్లే ఉంటారు. అందుకే ఈ రంగంలో అరుదుగా కనిపించే మహిళా పాకప్రవీణుల సంగతులు రికార్డు చేయాలనుకున్నారు అనూష డిడిగె. ముఖ్యంగా దక్షిణభారత దేశంలోని ఫుడ్ అండ్ బేవరేజెస్ పరిశ్రమతో ముడిపడి ఉన్న మహిళల జీవితాలను డాక్యుమెంట్ భావించారామె.

## సరైన దంతసిరి కోసం ఇలా చేయండి..



**హైదరాబాద్ :** ప్రతి మనిషి వేలిముద్రలు ఒకేలా ఉండనట్లే దంతాలు కూడా విభిన్నంగా ఉంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పంటి, చిగుళ్ల సమస్యలు తలెత్తుతాయి. భరించలేని నొప్పితోపాటు శాశ్వతంగా అవి దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రాం ప్రకారం మన దేశంలో 95 శాతం మంది ఏదో ఒక రకమైన చిగుళ్ల సమస్యతో బాధపడుతున్నారు. పదిహేనేండ్లలోపు పిల్లల్లో కనీసం 70 శాతం మంది వివిధ రకాల దంత సమస్యలతో సతమతమవుతున్నారు.

## సిఫారసు లేఖల రద్దుతో భక్తులకు ఊరట..

## నేరుగా క్యూలైన్ల ద్వారా దర్శనం



**తిరుమల :** తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న పరీక్షలు, ఎన్నికల కోడ్ అమలు వల్ల సిఫారసు లేఖలు రద్దుతో తిరుమలలో భక్తులకు దర్శనం సులువుగా అవుతుంది. భక్తులు నిన్న 11 కంపార్టుమెంట్లలో ఉన్నప్పటికీ వారిని క్యూపద్ధతిలో వెను వెంటనే పంపిస్తుండడతో దర్శనం ఇంతకుముందు కంటే తొందరగా అవుతుందని భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టోకెన్లు లేని భక్తులకు 16 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 69,072 మంది దర్శించుకోగా 26,239 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.51 కోట్లు వచ్చిందన్నారు.

## బీజేపీలో మాజీ సీఎంల పోరు

## : యడ్యూరప్ప వర్సెస్ సదానంద గౌడ




**బెంగళూర్ :** బీజేపీపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పార్టీ సీనియర్ నేత, కర్నాటక మాజీ సీఎం డీవీ సదానంద గౌడ ఎన్నికల రాజకీయాల నుంచి తప్పుకునేందుకు సిద్ధమని సంకేతాలు పంపారు. బెంగళూర్ నార్త్ సీట్‌ను తనకు ఇచ్చేందుకు పార్టీ నిరాకరించడంతో ఆయన గుర్రుగా ఉన్నారు. తనను కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆ పార్టీ అగ్రనేతల నుంచి ఆహ్వానం వచ్చిందని, అయితే తాను ఆ పార్టీలో చేరబోనని సదానంద గౌడ స్పష్టం చేశారు. బెంగళూర్ నార్త్ సీటును తనకు కాకుండా మరొకరికి పార్టీ కట్టబెట్టడంతో బీజేపీ తీరు పట్ల తాను నిరాశకు గురయ్యానని చెప్పారు. నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని కావాలని అన్నారు. పార్టీలో నియంతృత్వ వైఖరి ప్రజాస్వామ్యంలో మంచిది కాదని, పార్టీ కోసం కష్టపడిన నేతలను పక్కనపెట్టడం సరైంది కాదని ఆయన బీజేపీ అగ్రనేతల తీరును తప్పుపట్టారు. బాధ్యతలు చేపట్టిన నేతలు స్వార్థంతో వ్యవహరించడం విచారకరమని యడ్యూరప్ప లక్ష్యంగా ఆయన విమర్శలు గుప్పించారు. యడ్యూరప్ప కుమారుడు, రాష్ట్ర బీజేపీ చీఫ్ విజయేంద్రను పరోక్షంగా ప్రస్తావిస్తూ బీజేపీ ఓ కుటుంబంలా తయారైందని ప్రజలు అంటున్నారని విమర్శలు గుప్పించారు.

## పట్టపగలే ఇసుక అక్రమ రవాణా..

## పట్టించుకోని అధికారులు



**వరంగల్ :** వరంగల్ జిల్లాలో ఇసుక దందా జోరుగా కొనసాగుతున్నది. నిబంధనలకు నీళ్లొదిలి అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నారు. కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్న అధికారు లు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ముఖ్యంగా వరంగల్ వర్ధన్నపేట, ఐనవోలు, పర్వతగిరి మండలాల్లో ఉన్న ఆకేరు వాగులో పట్టపగలే యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. రోజు వరంగల్ నగరానికి వందల ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని, ఇసుక రవాణాతో భూగర్భజలాలు పడిపోతున్నాయని సమీప రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ఇసుక రవాణాను అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు.

## పంటలు నష్టపోయిన రైతులను

## ఆదుకుంటాం



**కామారెడ్డి :** పంట నష్టం జరిగిన రైతులందరికి పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రైతులు అధైర్యపడొద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కామారెడ్డి జిల్లాలో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి పరిశీలించారు. బిక్నూర్ మండలం మాసుపల్లి, జంగంపల్లి, దోమకొండా మండలం లింగుపల్లి గ్రామాల్లో పంటల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మీడియాతో మాట్లాడారు.

సీఎం రేవంత్ రెడ్డి పంట నష్టంపై సర్వే చేయాని అధికారులను ఆదేశించారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని చెప్పారు. అకాల వర్షాలతో పంట నష్టపో యిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణ యం తీసుకుందని చెప్పారు. సర్వే పూర్తికాగానే అధికారుల నివేదిక ప్రకారం రైతులకు ఆర్థిక సాయం చేస్తామననారు. 4-5 ఎకరాలున్న రైతులకు వారం రోజుల్లో నగదు బదిలీ పూర్తి చేస్తామని చెప్పారు.

## వికసిత్ భారత్ వాట్సప్ మెసేజ్‌లను వెంటనే ఆపేయండి.. కేంద్రానికి ఈసీ ఆదేశం




**హైదరాబాద్ :** సోషల్ మీడియా ద్వారా చేస్తున్న 'వికసిత్ భారత్' ప్రచారాన్ని వెంటనే నిలిపివేయాలని కేంద్రాన్ని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖగురువారం ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో.. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం వాట్సాప్ ద్వారా వికసిత్ భారత్ సందేశాలను పంపించడాన్ని వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కార్ కేంద్రంలో 2014లో అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను, భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ 'వికసిత్ భారత్' క్యాంపెయిన్‌ను వివిధ ప్రచార, ప్రసార మాధ్యమాల్లో కేంద్ర ప్రభుత్వంలోని ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిర్వహిస్తోంది.

# దేశంలో 37 శాతం మంది మహిళలు పనిమంతులే



**ముంబై :** దేశీయంగా పనిచేసే మహిళల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 69.2 కోట్ల మంది మహిళల్లో 37 శాతం మంది మహిళలు పనిమంతులే అని కేరియర్‌నెట్స్ 'ది స్టేట్ ఆఫ్ వుమెన్స్ ఎంప్లాయిమెంట్ ఇన్ ఇండియా' పేరుతో బుధవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. అత్యధిక మంది మహిళా ఉద్యోగులు కలిగిన నగరాల జాబితాలో 34 శాతంతో హైదరాబాద్ తొలి స్థానంలో నిలిచింది. ఆ త ర్వాతి స్థానాల్లో 33 శాతంతో పుణె, 29 శాతంతో చెన్నై ఉన్నాయి. 2022తో పోలిస్తే ఆ మరుసటి ఏడాదిలో మహిళా ఉద్యోగుల సంఖ్య 2-5 శాతం వరకు పెరిగారని తెలిపింది. ముఖ్యంగా జూనియర్ ప్రొఫెషనల్స్, ఎగ్జిక్యూటివ్ బోర్డ్‌ల్లో పనిచేసేవారు అధికంగా ఉన్నట్లు పేర్కొంది. గతేడాది కొత్తగా ఉద్యోగాలు పొందిన వారిలో 40 శాతం మంది ఫ్రెష్ ట్యాలెంట్ అని పేర్కొంది. మొత్తం ఉద్యోగ కల్పనలో 0-3 ఏండ్ల అనుభవం, 3 నుంచి 7ఏండ్ల అనుభవం ఉన్నవారి వాటా 20-25 శాతం వరకు ఉన్నారని తెలిపింది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో అత్యధిక మంది మహిళకు ఉద్యోగాలు లభించాయి.

# 4జీ వినియోగదారుల కంటే 3.6 రెట్లు అధికంగా డాటాను వినియోగిస్తున్న 5జీ యూజర్లు



**న్యూఢిల్లీ :** 4జీ వినియోగదారులు వినియోగిస్తున్న డాటా కంటే 5జీ యూజర్లు 3.6 రెట్లు అధికంగా డాటాను విని యోగిస్తున్నారని నోకియా తాజాగా వెల్లడిం చింది. అక్టోబర్ 2022 నుంచి దేశవ్యాప్తంగా 5జీ సేవలు అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. బుధవారం నోకియా విడుదల చేసిన 'మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండెక్స్' నివేది కలో స్పష్టంచేసింది. 2023లో మొత్తం వినియోగించిన డాటా లో 5జీ వాటా 15 శాతంగా ఉన్నది. 2023 లో ఒక్కో యూజర్ నెలకు సరాసరిగా 17.4 ఎక్సాబైట్స్ డాటాను వినియోగించారు.

# వచ్చే సమీక్షలో వడ్డీరేట్లు యథాతథమే!



**న్యూఢిల్లీ :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ భేటీ అయ్యారు. వచ్చే నెల తొలివారంలో తన పరపతి సమీక్షను ప్రకటించనున్న నేపథ్యంలో వీరిద్దరు భేటీ ప్రాధాన్యతను సంతరించుకున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను తన తొలి పరపతి సమీక్షను ఏప్రిల్ 3-5 వరకు నిర్వహించబోతున్నది. రిటైల్ ధరల సూచీ నాలుగు శాతం తగ్గడానికి ఆహార పదార్థాల ధరలు అడ్డంకిగా మారాయని ఆర్బీఐ విడుదల చేసిన బులెటిన్‌లో వెల్లడించింది. గతేడాది డిసెంబర్ నుంచి తగ్గుతూ వచ్చిన రిటైల్ ధరల సూచీ ఫిబ్రవరి నెలలో 5.09 శాతంగా నమోదైంది. మరోవైపు, వచ్చే సమీక్షలోనూ ఆర్బీఐ వడ్డీరేట్లను యథా తథంగా ఉంచే అవకాశాలున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయిలోనే కదలాడుతుండటం, ఆహార పదార్థాల ధరలు అధికంగా ఉండటమే ఇందుకు కారణమని తెలిపాయి.

# జేఎస్‌డబ్ల్యూ ఎంజీ 5 వేల కోట్ల పెట్టుబడి



**ముంబై :** చైనాకు చెందిన అతిపెద్ద వాహన సంస్థ ఎస్ఏఐసీ మోటర్‌తో జేఎస్‌డబ్ల్యూ గ్రూపు జతకట్టింది. ఇరు సంస్థలు కలిసి ఏర్పాటు చేసిన జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ ఇండియా భారత్‌లో భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. ప్రతి మూడు నుంచి ఆరు నెలలకొక సరికొత్త ఈవీని విడుదల చేయనున్నట్లు ప్రకటించిన సంస్థ..ఇందుకోసం గుజరాత్‌లో రూ.5 వేల కోట్ల పెట్టుబడితో రెండో ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నట్లు జేఎస్‌డబ్ల్యూ గ్రూపు చైర్మన్ సజ్జన్ జిందాల్ తెలిపారు. జాయింట్ వెంచర్‌లో ఏర్పాటైన సంస్థలోజేఎస్‌డబ్ల్యూకి 35 శాతం వాటా ఉండగా, ఇండియన్ ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్‌కు 8 శాతం, ఎంజీ మోటర్‌కు 3 శాతం ఉద్యోగులకు ఉండగా, మిగతా 49 శాతం వాటా ఎస్ఏఐసీ ఉన్నది. 2030 నాటికి దేశవ్యాప్తంగా ప్రతియేటా కోటి వాహనాలు అమ్ముడవుతాయని అంచనావేస్తున్న సంస్థ..వీటిలో పది లక్షల యూనిట్లు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నది సంస్థ. రెండో ప్లాంట్ అందుబాటులోకి వస్తే కంపెనీ ఉత్పత్తి సామర్థ్యం లక్ష యూనిట్ల నుంచి 3 లక్షల యూనిట్లకు పెరగనున్నది. 2023లో ఎంజీ మోటర్ దేశంలో 60 వేల యూనిట్ల వాహనాలను విక్రయించింది.

# గెలాక్సీ సిరీస్‌లో నయా ఫోన్లు



**హైదరాబాద్ :** దేశంలో అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండైన సామ్‌సంగ్.. గెలాక్సీ సిరీస్‌లో భాగంగా మరికొన్ని స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. మధ్య-ప్రీమియం స్థాయి సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గెలాక్సీ ఏ55 5జీ, గెలాక్సీ ఏ35 మాడళ్లను ప్రవేశపెట్టింది. గోరిల్లా గ్లాస్ విక్టస్‌ంప్రొటెక్షన్, ఏఐతో పనిచేసే విధంగా కెమెరా ఫీచర్, ట్యాంపర్-రెసిస్టెంట్ సెక్యూరిటీ సొల్యూషన్ ఫీచర్ కలిగిన ఈ ఫోన్లు నాలుగు రకాల్లో లభించనున్నాయి. గెలాక్సీ ఏ55 5జీ మొబైల్ రూ.36,999 నుంచి రూ.42,999 లోపు, గెలాక్సీ ఏ35 5జీ మొబైల్ రూ.27,999 నుంచి రూ.30,999 లోపు లభించనున్నాయి. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ, వన్‌కార్డ్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ కార్డుతో కొనుగోలు చేసిన వారికి రూ.3 వేల వరకు క్యాష్‌బ్యాక్, ఆరు నెలలపాటు నో కాస్ట్ కల్పించింది.

# రాష్ట్రంలో పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

## : సీఎస్ శాంతి కుమారి



**హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి సమర్థవంతంగా అమలు చేయడానికి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పోలీస్, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, అటవీ, రెవెన్యూ, రవాణా తదితర శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఏవిధంగానైతే పని చేశారో అదే స్ఫూర్తితో రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలోనూ మరింత సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులలో ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళి అమలుపై అన్ని ప్రధాన శాఖల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికీ వివిధ శాఖల ద్వారా చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని వెల్లడించారు. వీటిలో పోలీస్ శాఖ ద్వారా 444 చెక్ పోస్టులుండగా, 9 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులున్నాయని తెలిపారు. ఇప్పటివరకు పోలీసుల తనిఖీల్లో రా రూ. 10 కోట్లు పట్టుబడ్డాయన్నారు. లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్, బంగారాన్ని కూడా స్వాధీన పర్చుకున్నామని తెలిపారు. రవాణా శాఖ ద్వారా 15 చెక్ పోస్టులు, 52 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ చెక్ పోస్టులు 24 గంటలు పనిచే స్తాయని తెలిపారు. రవాణా శాఖ బృందాలు జరిపిన తనిఖీల్లో రూ. 34 .31 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా 16 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం తోపాటు 31 స్ట్రాటెజిక్ పాయింట్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. వీటితోపాటు, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ వస్తువులను పంచేందుకు అవకాశమున్న 25 గోదాములను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని వెల్లడించారు. వీటితోపాటు 141 గోదాములు, 912 వివిధ వస్తువుల తయారీ గోదాములపై కూడా నిఘా ఉంచామని పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా 21 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు, ఆరు మొబైల్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు, అక్రమ మద్యం తయారీకి అవకాశం ఉన్న ఎనిమిది జిల్లాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సాధించామని సీఎస్ తెలిపారు. మద్యం అక్రమ రవాణాకు అవకాశమున్న ఐదు రైలు మార్గాలను గుర్తించి వాటి నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటివరకు రూ. 50 లక్షల విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని డిస్టిలరీలపై ప్రత్యేక నిఘా ఉంచామని, సీసీటీవీలను ఏర్పాటు చేసి డిస్టిలరీస్ ద్వారా మద్యం సరఫరాను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లోని పోలీస్ శాఖకు చెందిన పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుండి కూడా మద్యం రవాణాపై సీసీటీవీల ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించినట్టు తెలిపారు. అటవీ శాఖ ద్వారా కూడా 65 చెక్ పోస్టులు ఏర్పాటు కాగా దీనిలో 18 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయని శాంతి కుమారి తెలిపారు. ఈ సమీక్షా సమా వేశంలో డీజీపీ రవీ గుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పీసీసీఎఫ్ దొబ్రియల్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, అడిషనల్ డీజీ ఎస్‌కే జైన్, రవాణా శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, వాణిజ్య పన్నుల శాఖ కమీషనర్ టీకే శ్రీదేవి, ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్, సమాచార పౌరసంబంధాల శా ఖ స్పెషల్ కమీషనర్ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ టాప్ ముస్లిం నాయకుడు



**గౌహతి:** లోక్‌సభ ఎన్నికలకు ముందు అస్సాంలో అధికార బీజేపీకి షాక్ తగిలింది. బీజేపీ మైనార్టీ అగ్ర నాయకుడు అమీనుల్ హక్ లస్కర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. అస్సాం కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ జితేంద్ర సింగ్ అల్వార్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అస్సాంలో బీజేపీ తన రాజకీయ భావజాలాన్ని కోల్పోయిందని ఆయన ఆరోపించారు. అందుకే ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. 'నేను 13 ఏళ్లుగా బీజేపీలో ఉన్నా. అప్పటి బీజేపీకి ఇప్పటికి చాలా తేడా ఉంది. ఆ సమయంలో బీజేపీ మార్పు గురించి మాట్లాడేది' అని అన్నారు.

కాగా, బీజేపీ సిద్ధాంతం ఇప్పుడు బద్రుద్దీన్ అజ్మల్‌కు చెందిన ఆల్ ఇండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) మారిదిగా మారిందని అమీనుల్ హక్ లస్కర్ ఆరోపించారు. బీజేపీ నుంచి తాను వైదొలగడం అధికార పార్టీలో మైనారిటీ వర్గం విశ్వసనీయతను ప్రభావితం చేస్తుందని ఆయన అన్నారు. మరోవైపు 2016లో అస్సాం బీజేపీ తొలి మైనారిటీ ఎమ్మెల్యేగా అమీనుల్ హక్ లస్కర్ గెలిచారు. అస్సాం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నారు. అస్సాం రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్‌పర్సన్‌గా కూడా నియమితులయ్యారు. 2021లో ఏఐయూడీఎఫ్‌కు చెందిన కరీం ఉద్దీన్ బర్భూయా చేతిలో ఆయన ఓడిపోయారు.

# ఈ ఫొటో తప్పని నిరూపించగలరా..?


## సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ లీడర్ మన్నె క్రిశాంక్ సవాల్




**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ సవాల్ విసిరారు. చిత్రపురి సొసైటీలో రూ. 3 వేల కోట్ల భూదందాకు పాల్పడిన అనుముల మహానంద రెడ్డికి తనకు ఏం సంబంధం లేదని రేవంత్ రెడ్డి నిరూపించగలరా..? అని క్రిశాంక్ సవాల్ చేశారు. ఈ భూదందాకు సంబంధించిన పోస్టు పెట్టినందుకు మన్నె క్రిశాంక్‌పై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి, ఆయన ఫోన్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మన్నె క్రిశాంక్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. చిత్రపురి సొసైటీలో రూ. 3 వేల కోట్ల భూదందా చేసిన అనుముల మహానంద రెడ్డికి, సీఎం రేవంత్ రెడ్డికి సంబంధం ఉందని ఆధారాలు ఉన్నాయి. దమ్ముంటే ఇది తప్పని రేవంత్ రెడ్డి కోర్టుకి వచ్చి నిరూపించగలడా? అని సవాల్ చేశారు. ఆయన ఎవరో మాకు తెలియదు.. ఆయనను అసలు చూడనే చూడలేదు అని వాదిస్తున్నారు. ఆయనతో పరిచయమే లేకపోతే, ఆయనను చూడకపోతే ఈ ఫొటోలు ఎలా వస్తాయి..? రేవంత్ రెడ్డికి చాలెంజ్ చేస్తున్నా.. కోర్టుకు వచ్చి.. ఈ ఫొటో తప్పని నిరూపించగలరా..? సుప్రీంకోర్టు, హైకోర్టు.. ఏ కోర్టుకైనా సరే వెళ్దాం అని క్రిశాంక్ సూచించారు. మేమే కాదు.. చిత్రపురి సాధన సమితి వారు కూడా ఈ భూదందాపై గతంలో ప్రశ్నించారు. ఈ భూదందాలపై మాజీ గవర్నర్ తమిళిసైకి కూడా చిత్రపురి సాధన సమితి వారు ట్వీట్ చేశారు. రూ. 3 వేల కోట్ల కుంభకోణం జరిగిందని తెలిపారు. చిత్రపురి సిటీపై కేసులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో ప్రశ్నించిన వాటిపై మళ్లీ మేం ప్రశ్నించినందుకు మా మీద కేసు నమోదు చేశారు. ఫోన్‌ను కూడా సీజ్ చేశారు.

# మహారాష్ట్రలో వరుస భూకంపాలు..

## నిమిషాల వ్యవధిలోనే రెండుసార్లు కంపించిన భూమి



**మహారాష్ట్ర :**మహారాష్ట్ర వరుస భూకంపాలు వణికించాయి. గురువారం ఉదయం కేవలం నిమిషాల వ్యవధిలోనే రెండు సార్లు భూమి కంపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. హింగోలి నగరంలో గురువారం ఉదయం 10 నిమిషాల వ్యవధిలో రెండు భూకంపాలు సంభవించినట్లు తెలిపింది. ముందుగా ఉదయం 6:08 గంటల సమయంలో మొదటి సారి భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంపం తీవ్రత 4.5గా నమోదైంది. ఆ తర్వాత 6:19 గంటలకు రెండో సారి భూమి కంపించింది. అప్పుడు రిక్టర్ స్కేలుపై భూకంపం తీవ్రత 3.6గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి పది కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. ఈ భూప్రకంపనల కారణంగా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు నివేదికలు లేవు.

కాగా, ఇవాళ అరుణాచల్ ప్రదేశ్ కూడా వరుస భూకంపాలు వణికించిన విషయం తెలిసిందే. రెండు గంటల వ్యవధిలో రెండు సార్లు భూ ప్రకంపనలు నమోదయ్యాయి. ముందుగా తెల్లవారుజామున 01:49 గంటల సమయంలో 3.7 తీవ్రతతో భూమి కంపించింది.

## నీటి సరఫరా లో అవాంతరాలు లేకుండా చూడండి : బల్దియా కమీషనర్ అశ్విని తానాజీ వాకడే

### ఇంజనీరింగ్ అధికారులతో నీటి సరఫరా తీరు పై సమావేశం...



GWMC21 మార్చి 2024 : నీటి సరఫరా లో అవాంతరాలు లేకుండా చూడాలని బల్దియా కమీషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గురువారం ప్రధాన కార్యాలయం లో ఇంజనీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశం లో కమీషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమీషనర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు ఆయా డివిజన్ లలో నీటి ఇబ్బందులు తీవ్రం గా ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడానికి 66 డివిజన్ లలో ప్రతి డివిజన్ కు సూక్ష్మ ప్రణాళిక (మైక్రో ప్లాన్ ) తయారు చేయాలని స్థానికం గా ఉన్న పరిస్థితుల పై అవగాహన ఏర్పరచు కొని తగు పరిష్కార మార్గాలతో సిద్ధం గా ఉండాలని, తక్కువ నీరు వచ్చే ప్రాంతాలను (టెయిల్ ఎండ్ )గుర్తించాలని,వేసవి కాలం దృష్ట్యా ఆయా డివిజన్ లలో ఎన్ని చేతి పంపులు ఉన్నాయి? అందులో పనిచేసేవి ఎన్ని? రిపేరింగ్ దశలో ఎన్ని ఉన్నాయో వాటికి సంబందించిన ప్రోగ్రెస్ ఉండాలని 2-3 రోజుల్లో మరమత్తులు చేయించి వినియోగం లోకి తీసుకురావాలని,చివరి పాయింట్ వరకు ఉన్న గృహాలకు నీరు అందించాలని ఇందుకోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో స్పష్టత ఉండాలని, నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో వాల్వు ల పనితీరు పరిశీలించాలని ఈ సందర్భం గా కమీషనర్ తెలిపారు.

ఇట్టి కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర ఈ ఈ లు శ్రీనివాస్ రాజయ్య డి ఈలు రవికుమార్ సంతోష్ బాబు సారంగం కృష్ణమూర్తి రంగారావు దేవానంద్ పాల్గొన్నారు

## ప్రణీత్ రావు పిటిషన్ కొట్టివేత



**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయిన ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్ రావు తన కస్టడీ అక్రమం అంటూ దాఖలు చేసుకున్న పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. కొంత మంది అధికారులు తనను విచారించవద్దని.. కస్టడీలో తాను చెబుతున్న విషయాలు మీడియాకు లీక్ అవుతున్నాయని, విచారణ తర్వాత జైలుకు తీసుకెళ్లాలని ఇలా రకరకాల విషయాలు పిటిషన్ లో పెట్టారు. అన్నింటిని హైకోర్టు తోసి పుచ్చింది.ప్రణీత్ రావు కస్టడీలో చెబుతున్న వివరాలతో పలువుర్ని సిట్ అరెస్ట్ చేసే అవకాశం కనిపిస్తోంది.

## అధిక ధరలకు అమ్ముతున్నారని 4 వైన్ షాపులపై దాడి చేసి లూటీ చేసిన మహిళలు

**భద్రాద్రి కొత్తగూడెం -**

ఇల్లందు నియోజకవర్గం టేకులపల్లిలో పేరొందిన బ్రాండ్లు అందుబాటులో లేకుండా కేవలం బెల్ట్ షాపులో అమ్ముతున్నారని.. ఒక్కో బాటిల్‌పై 20 నుంచి 30 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారని ఒకేసారి 4 వైన్ షాపులపై దాడి చేసి, మద్యం స్టాక్ ఎత్తుకెళ్లిన మహిళలు, గ్రామస్తులు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.

## బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పై వేట

### అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేసిన 16 మంది కార్పొరేటర్లు

**రంగారెడ్డి :** రాజేంద్రనగర్ నియోజకవర్గం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన మేయర్ మహేందర్ గౌడ్ పై 16 మంది కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. గురువారం బండ్లగూడ మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహి ంచారు. రాజేంద్రనగర్ ఆర్డిఓ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బండ్లగూడ జాగిర్ మున్సిపల్ మేయర్ మహేంద్ర గౌడ్ కు వ్యతిరేకంగా 16 మంది కార్పొరేటర్లు ఓటు వేశారు. దీంతో మేయర్ మహేందర్ గౌడ్ పదవి నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది .ఈ నేపథ్యంలో గురువారం ఏర్పాటు చేసిన అవిశ్వాస తీర్మాన సమావేశంలో ముందుగా నాలుగో వార్డ్ కార్పొరేటర్ రవీందర్ రెడ్డి. 16వ వార్డ్ కార్పొరేటర్ పుష్పలత శ్రీనివాస్ రెడ్డిలు అవిశ్వాసానికి అనుకూలంగా ప్రతిపాదన చేశారు. తర్వాత మేయర్ ను తొలగించాలంటూ మిగిలిన 14 మంది కార్పొరేటర్లు చేతులెత్తి తమ ఓటింగ్ను ధ్రువీకరించారు. ఇదిలా ఉండగా మున్సిపల్ లోని 17వ వార్డుకు చెందిన లతా ప్రేమ్ గౌడ్ ను మేయర్ గా ఎన్నుకోడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. కలెక్టర్ తేదీ ప్రకటించిన తర్వాత లతా ప్రేమ్ గౌడ్ బండ్లగూడ జాగిర్ మున్సిపల్ మొదటి మహిళా మేయర్ గా ఎన్నిక కానున్నారు.

### మెడిసిటీ హాస్పిటల్ మేడ్చల్ వారి ఆధ్వర్యంలో

## ఉచిత మెగా వైద్య శిబిరం

**శామీర్ పేట :** లాల్ గడిమాలకపేట , మండలం శామీర్పేట్ ,జిల్లా మేడ్చల్ ,నందు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడము జరిగినది. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు మరియు కంటి పరీక్షలతో పాటు,చెవి,ముక్కు,గొంతు, వరిబీజము, బీజకుట్టు,గడ్డలు,కనతులు, థైరాయిడ్ గడ్డలు,గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.ఇట్టి కార్యక్రమములో గ్రామ బిల్ కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి కారోబార్ రంజిత్ ,అభిలాష్ ప్రజలు పాల్గొనడము జరిగింది. ఈ వైద్య శిబిరంలో 132 మందికి షుగర్, బీపీ, టెస్టులు చేయడం జరిగినది,ఆపరేషన్ అవసరము ఉన్న వాళ్ళ 33 మందిని రిపర్ రాయడం జరిగింది.వీరిని మెడిసిటీ హాస్పిటల్ కు తరలించి ఉచిత ఆపరేషన్లు చేయడం జరుగుతుంది.

ఈ వైద్య శిభిర కార్యక్రమంలో డాక్టర్లు ఒమార్ ,అభిషేక్ , వైభవి , దివ్య ,సమ్రాన్,మార్కెటింగ్ ఇంచార్జి కుమారస్వామి, నాగార్జున,పూజ ,లు పాల్గొనడం జరిగింది.

## బియన్ తిమ్మాపూర్ లో మత్స్య పరిశ్రమిక మార్కెటింగ్ సహకార సంఘం ఎన్నిక

**భువనగిరి రూరల్** మండలంలోని బియన్ తిమ్మాపూర్ గ్రామంలో మత్స్య సహకార సంఘం ఎన్నిక గురువారం జరిగింది. మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సంఘం అసిస్టెంట్ రిజిస్టర్డ్ కే ఈశ్వరయ్య పర్యవేక్షణలో కమిటీ ఎన్నిక నిర్వహించగా.. కాగా ఈనెల 19న మంగళవారం సొసైటీ ఓటింగ్ జరగగా నిన్న గురువారం కమిటీ సభ్యులను అధికారికంగా ప్రకటిస్తూ, నియామక పత్రాన్ని సొసైటీ సభ్యులకు అసిస్టెంట్ రిజిస్టర్ కే. ఈశ్వరయ్య అందజేసినట్లు తెలిపారు. సొసైటీ అధ్యక్షునిగా జిన్నా రాజు, ఉపాధ్యక్షుడు జిన్నా శ్రీను, సెక్రటరీ కుషంగల.

## పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు - సి.ఎస్ శాంతి కుమారి

**హైదరాబాద్ :**

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి సమర్థవంతంగా అమలు చేయడానికి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై నేడు సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పోలీస్, ఎక్సయిజ్, వాణిజ్య పన్నులు, అటవీ, రెవిన్యూ, రవాణా తదితర శాఖల ఉన్నతాధికారులు ఈ సమావే శంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఏవిధంగానైతే పనిచేసారో అదే స్ఫూర్తితో రానున్న లోక్ సభ ఎన్నికల నిర్వహణలోనూ మరింత సమర్థవంతంగా పని చేయాలని కోరారు. రాష్ట్రంలో సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, ఛత్తీస్ గఢ్ సరిహద్దులలో ప్రత్యేకంగా చెక్ పోస్టు లను ఏర్పాటు చేయడంతో పాటు., ఆయా రాష్ట్రాల చెక్ పోస్టు లతో కలిసి సమన్వయంతో పటిష్ట నిఘా ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళి అమలుపై అన్ని ప్రధాన శాఖల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికీ వివిధ శాఖల ల ద్వారా చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని వెల్లడించారు. వీటిలో పోలీస్ శాఖ ద్వారా 444 చెక్ పోస్టులుండగా, 9 అంతర్రాష్ట్ర చెక్-పోస్ట్ లున్నాయని అన్నారు. ఇప్పటివరకు పోలీస్ శాఖ ద్వారా పదికోట్ల రూపాయలను స్వాధీన పర్చుకోవడంతోపాటు లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్, బంగారాన్ని కూడా స్వాదీన పర్చుకున్నామని తెల్లిపారు. రవాణా శాఖ ద్వారా 15 చెక్ పోస్టులు, 52 ఎన్ఫోర్స్ మెంట్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ చెక్ పోస్టులు 24 గంటలు పనిచేస్తాయని తెలిపారు. రవాణా శాఖ బృందాలు జరిపిన తనిఖీ లలో రూ. 34 .31 లక్షలను స్వాధీన పర్చుకున్నామని అన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా 16 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం తోపాటు 31 స్ట్రాటెజిక్ పాయింట్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. వీటితోపాటు, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ వస్తువులను





పంచేందుకు అవకాశమున్న 25 గోదాములను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని వెల్లడించారు. వీటితోపాటు, 141 గోదాములు, 912 వివిధ వస్తువుల తయారీ గోదాములపై కూడా నిఘా ఉంచామని అన్నారు. ఎక్సయిజ్ శాఖ ద్వారా 21 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు, ఆరు మొబైల్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు, అక్రమ మద్యం తయారీకి అవ కాశం ఉన్న ఎనిమిది జిల్లాలను గుర్తించి వాటిపై ప్రత్యేక ద్రుష్టి సాధించామని సి.ఎస్ తెలియచేసారు. మద్యం అక్రమ రావాణా కు అవకాశమున్న ఐదు రైలు మార్గాలను గుర్తించి వాటి నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటివరకు రూ. 50 లక్షల విలువైన మద్యాన్ని స్వాధీన పరుచుకున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని డిస్టిలరీలపై ప్రత్యేక నిఘా ఉంచామని, సి.సి టీవీలను ఏర్పాటు చేసి డిస్టిలరీస్ ద్వారా మద్యం సరఫరాను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ లోని పోలీస్ శాఖకు చెందిన పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుండి కూడా మద్యం రవాణాపై సి.సి టీవీ ల ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించినట్టు తెలిపారు. అటవీ శాఖ ద్వారా కూడా 65 చెక్ పోస్టులు ఏర్పాటు కాగా దీనిలో 18 అంతర్ రాష్ట్ర చెక్ పోష్టులునున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ని పటిష్టంగా అమలుచేయడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని శాంతి కుమారి తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ రవీ గుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పీసీసీఎఫ్ దొబ్రియల్, హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, అడిషనల్ డీజీ ఎస్.కె. జైన్, రవాణా శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, వాణిజ్య పన్నుల శాఖ కమీషనర్ టీ.కె. శ్రీదేవి, ఎక్సయిజ్ శాఖ కమీషనర్ శ్రీధర్, సమాచార పౌరసంబందాల శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

### ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

## ప్రపంచ జల దినోత్సవము పై అవగాహన

**చందానగర్ :** ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నీటి యొక్క ప్రాముఖ్యత మరియు నీరు వృథా కాకుండా కలుషితం కాకుండా చూడటంపై అవగాహన పెంపొందించే విషయాలను వివరించే గోడ పత్రిక ను హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (హెచ్. ఎం. డబ్ల్యూ మరియు ఎస్.బి)15వ డివిజన్ జనరల్ మేనేజర్ శ్రీ రాజశేఖర్ గారు వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మార్చి 22వ తారీఖునాడు ఐక్యరాజ్యసమితి వారి సూచనల మేరకు 'ప్రపంచ నీటి దినోత్సవాన్ని' నిర్వహించుకొనుచున్నాము. దీని యొక్క ప్రధాన ఉద్దేశ్యం నీటి ప్రాముఖ్యతను గురించి అవగాహన కల్పించడం మరియు నీటి సంరక్షణ గురించి తెలియజేయటమే అని అన్నారు. ప్రతి సంవత్సరం ఒక నినాదంతో ఈ పండుగ నిర్వహించుకొనుచున్నాము. ఈ సంవత్సరం శాంతి కోసం నీరు అనే నినాదంతో నిర్వహించుకొనుచున్నాము. ఈ సృష్టిలో సకల జీవరాసులకు గాలి తరువాత నీరే ప్రధానమైనది అని అన్నారు. ఈ భూగోళము పైని సృష్టిలో ఉన్న నీటి వనరులలో 99 శాతం ఉప్పునీరే. ఇందులో 97 శాతం సముద్రాలలో ఉండగా మిగతా నీరు నదులు, చెరువులలో ఉన్నది. త్రాగేందుకు ఉపయోగపడే జలము కేవలం 1 శాతం మాత్రమే. అందులో 0.86 శాతం చెరువులు, 0.02 శాతం నదులలో, మిగతా 0.12 శాతం భూగర్భ జలాలు గా ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా కేవలం 0.3 శాతం నీరు మాత్రమే ఉపయోగపడే విధంగా ఉన్నది. ఈ కొద్ది



పాటి వనరులే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 700 కోట్ల పైచిలుకు గల జనాభా యొక్క దాహన్ని మరియు ఇతర అవసరాలు తీరుస్తున్నాయి. ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటి వనరుల సమీప ప్రాంతాలలోనే విలసిల్లాయి. జీవము నీటితోనే మొదలయింది. అంతేకాకుండా ప్రపంచానికి ఆహారోత్పత్తులను ఉత్పత్తి చేయడానికి కూడా నీరు చాలా అవసరం. ప్రకృతి అంతా నీటితోనే నడుస్తుంది. అభివృద్ధి జరగాలంటే నీటి వనరులు కావాలి. జీవ వైవిధ్య రక్షణ, జీవం నీటితోనే సాధ్యమవుతుంది. ఇన్ని తెలిసినా నీటిని వృథా చేస్తూ, కలుషితం చేసి విషతుల్యంగా మార్చేస్తున్నాము. ప్రపంచంలో కోట్లాదిమంది త్రాగడానికి నీరు లేక దాహంతో అల్లాడి పోతుంటే నీటిని వృథాగా నేలపాలు చేస్తున్నాం. నీటి వనరులను వ్యర్థాలతో కలుషితం చేసి త్రాగడానికి వీలు లేని విధంగా తయారు చేస్తున్నాం. ప్రపంచంలో పరిశుభ్రమైన నీరు అందక, అనారోగ్యం పాలై వేలాదిమంది చనిపోతున్నారు. ముఖ్యంగా భారతదేశంలో ప్రతి మానవునికి గ్రామాలు మరియు చిన్న పట్టణాలలో రోజుకు 130 లీటర్లు, నగరాలలో 150 లీటర్లు త్రాగడానికి, స్నానానికి, వంటకు ఇత్యాది గృహ అవసరాలకు కనీసంగా కావలసి వస్తుంది అని అన్నారు. భవిష్యత్తులో నీటికొరకు యుద్ధాలు (దేశాల మధ్య, రాష్ట్రాల మధ్య, జిల్లాల మధ్య) జరిగే ప్రమాదముందని ఐక్యరాజ్యసమితి తన నివేదికల ద్వారా హెచ్చరిస్తున్నది. కావున భూగర్భ జలమట్టాలు పెంచడానికి ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ప్రకృతి ప్రసాదించిన వనరులను భవిష్యత్తు తరాలకు అందించడానికి పొదుపుగా వాడుకోవలసిన సామాజిక బాధ్యత అందరిమీదా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అందరిచేత ' లిఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటాం. నీటిని వృథా చేయం. నీటి వనరులను కలుషితం కానీయం' అని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ మారబోయిన సదానంద్ యాదవ్, సభ్యులు పాలం శ్రీను, వెంకటేశ్వర్లు, రఘునాథరావు, జి.వి.రావు, జిల్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ గా మామిండ్ల జ్యోతీ కృష్ణ ఏకగ్రీవ ఎన్నిక

### ప్రజా ప్రతినిధులు అధికారుల సమక్షంలో బాధ్యతలు చేపట్టిన తూప్రాన్ మున్సిపాలిటీ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ

**మనోహరాబాద్ :** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ లో ఖాళీగా ఉన్న చైర్మన్ పదవి భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు మార్చ్ 21న గురువారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక నిర్వహించడం జరిగింది. మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కాజా కాజా మొహినుద్దిన్ ఆధ్వర్యంలో నిబంధన ప్రకారం నిర్వహించారు. మున్సిపాలిటీలోని 16వ వార్డు సభ్యులు ఉండగా ఎక్స్ అఫీషియల్ వార్డు సభ్యులు ఎమ్మెల్సీ శ్రీ కూర రఘోత్తం రెడ్డి , కౌన్సిలర్ రాముని గారి శ్రీశైలం గౌడ్ , కొడిప్యాక నారాయణగుప్త, నంద్యాల శ్రీనివాస్, జిన్నా భగవాన్ రెడ్డి, చింత రవీందర్ రెడ్డి, శ్రీమతి శ్రీ పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా , జమాల్పూర్ లక్ష్మీబాయి, మామిళ్ల జ్యోతి కృష్ణ, నర్సోజి ,చెలిమెల ప్రియాంక, బాణపురం రాజు, చైర్ పర్సన్ ఎన్నిక కాబడుట కొరకు ప్రతిపాదించాబడినారు.

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ చైర్మన్ గా 4వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి మామిండ్ల జ్యోతీ కృష్ణ ముదిరాజు గురువారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆర్డీవో జయ చంద్రా రెడ్డి ప్రకటించారు. గురువారం ఉదయం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కు పది మంది కౌన్సిలర్లు ఒక ఎమ్మెల్సీ హాజరు కాగా ఎన్నికల నియమావళినీ ఎన్నికల అధికారి ఆర్డీవో జయ చంద్రా రెడ్డి చదివి వినిపించారు. అనంతరం చైర్మన్ గా 4వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల జ్యోతీ కృష్ణ ముదిరాజు ను చైర్మన్ గా కౌన్సిలర్ భగవాన్ రెడ్డి ప్రపోజ్ చేయగా 16 వార్డు కౌన్సిలర్ కోడిప్యాక నారాయణ గుప్త బలపర్చాడు. దీనితో మామిండ్ల జ్యోతీ కృష్ణ ముదిరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి మున్సిపల్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మున్సిపల్






కమిషనర్ ఖాజా మోహికొద్దిన్ చైర్మన్ ఛాంబర్ లో గ్రీన్ ఇంక్ పెన్ను లు ఇవ్వగా అధికార లాంచనాలతో భాధ్యతలు స్వీకరించిన జ్యోతీ కృష్ణ ముదిరాజు మాట్లాడుతూ తన సహచర తోటి కౌన్సిలర్ల ధన్యవాదాలు తెలిపారు. తన కు ఇచ్చిన పదవి భాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టి అందరినీ కలుపుకొని ముందుకు తీసుకెల్లుతానని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా గతంలో మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్ పై అవిశ్వాసం పెట్టిన సంగతి అందరికి తెలిసిందే. కాగా అవిశ్వాసం నెగ్గి ఇంఛార్జి చైర్మన్ గా కొనసాగిన నందాల శ్రీనివాస్ ఎప్పటి లాగే వైస్ చైర్మన్ గా కొనసాగుతారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఫర్మాలిటి ప్రకారం సాదా సీదాగా ప్రమాణ స్వీకారం జరిగింది.

తూప్రాన్ సిఐ కృష్ణ, ఎస్సై శివానందం ఆధ్వర్యంలో ఎన్నికల సందర్భంగా అవంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.


ప్రమాణస్వీకారం కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, సీనియర్ నాయకులు నేత మహేందర్ రెడ్డి, జింక మల్లేష్, బాలకృష్ణారెడ్డి, వెంకటేష్ యాదవ్, భగవాన్ రెడ్డి, తిమ్మాపురం నర్సింలు, సత్యనారాయణ గౌడ్, మామిండ్ల శ్రీనివాస్, నాగరాజ్ గౌడ్, ఉమర్, అనిల్, రఘుపతి, రమేష్, నర్సింలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ సినిమా వేరే లెవల్లో ఉంటుంది..

## 'ఆర్‌సీ 16'పై శివ రాజ్‌కుమార్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ కథానాయకుడిగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఆర్‌సీ 16. ఈ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభోత్సవం జరుపుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందించనున్నాడు. అయితే ఈ సినిమాలో ప్రముఖ కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్ ఓ కీలక పాత్ర పోషిస్తుండగా.. తాజాగా మూవీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.బుచ్చిబాబు మంచి విజన్ ఉన్న దర్శకుడని.. తాను కథ చేప్పేందుకు నా దగ్గరకు వచ్చినప్పుడు అతడికి అరగంట సమయం ఇచ్చానని.. అయితే బుచ్చిబాబు కథ చెప్పడం మొదలు పెట్టి అది పూర్తయ్యేవరకు గంట అయ్యిందని తెలిపారు. కథ వింటున్నప్పుడు చాలా రోజుల తర్వాత ఒక మంచి సినిమా చేస్తున్నానని మనసులో అనుకున్న.. ఈ సినిమాలో పాత్రలను బుచ్చిబాబు చక్కగా రాశారని.. ఇది పూర్తిగా వేరే స్థాయిలో ఉంది. అతడు ఆ క్యారెక్టర్ ఎలా ఇమాజిన్ చేసుకున్నాడో అని ఆశ్చర్యం కలిగింది అంటూ శివన్న చెప్పుకోచ్చాడు.ఉత్తరాంధ్ర స్పోర్ట్స్ బ్యాగ్‌డ్రాప్‌తో వస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీమూవీ మేకర్స్ సమర్పిస్తున్నది. వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలపై వెంకటసతీశ్ కిలారు అత్యంత భారీ వ్యయంతో నిర్మించనున్నారు. యూనివర్సల్ అప్పీల్ ఉండే పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ని బుచ్చిబాబు సిద్ధం చేశారని యూనిట్ సభ్యులు తెలిపారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ మొదలు కానుంది.



## ఎర్ర చీర.. ఒంటినిండా బంగారంతో శ్రీవల్లి.. పుష్ప 2 నుంచి రష్మిక లుక్ లీక్



టాలీవుడ్‌లో రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ సినిమాల్లో ఒకటి పుష్ప.. ది రూల్. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కి బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన పుష్ప.. ది రైజ్‌కు సీక్వెల్‌గా వస్తున్న ఈ మూవీలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప రాజ్‌గా మరోసారి ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. కాగా ఈ సినిమాను ఇండిపెండెన్స్ డే సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించేశారు మేకర్స్. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ ఇంట్రో విడుదల చేయగా.. ఫుల్ రెస్పాన్స్ వచ్చింది. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి రష్మిక ఫోటో లీక్ అయ్యింది.ఈ మూవీలో రష్మిక మందన్నా శ్రీవల్లి పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే.

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వైజాగ్‌లో జరుపుకుంటుడగా.. తాజాగా ఈ పాత్రకు సంబంధించిన ఒక లుక్ బయటకు వచ్చింది. ఎరుపు రంగు చీరలో ఉన్న శ్రీవల్లి ఒంటినిండా బంగారు ఆభరణాలు ధరించి మహాలక్ష్మి లాగా అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోంది.

## 'విశ్వంభర' నుంచి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ పంచుకున్న త్రిష



పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'విశ్వంభర'. పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష దాదాపు 18 ఏండ్ల తర్వాత చిరంజీవితో కలిసి ఇందులో నటిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా త్రిష ఒక పోస్ట్ పెట్టింది.విశ్వంభర సెట్స్‌లో మెగాస్టార్ చిరంజీవి, ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణిలతో కలిసి త్రిష ఫొటో దిగి పోస్ట్ చేసింది. ఇక ఈ ఫొటోకు దివ్యమైన లెజెండరీలతో కుడుకున్న ఉదయం అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఇక ఈ మూవీ సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ మూవీ తెరకెక్కుతుండగా యువీ క్రియేషన్స్ సంస్థ సుమారు రూ. 200 కోట్లతో బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తుంది. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా ఈ చిత్రాన్ని 2025 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## కిడ్నాప్ అనేది క్రైమ్ కాదు ఒక ఆర్ట్..

### ఆసక్తికరంగా 'పారిజాత పర్వం' టీజర్




టాలీవుడ్ యువ నటుడు చైతన్య రావు, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రల్లో వస్తున్న తాజా చిత్రం 'పారిజాత పర్వం'. ఈ సినిమాకు సంతోష్ కంభంపాటి దర్శకత్వం వహిస్తుండగా.. సునీల్, శ్రద్ధా దాస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. క్రైమ్ కామెడీ రానున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే ఫస్ట్ లుక్‌తో పాటు కాన్సప్ట్ వీడియో విడుదల చేయగా.. ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాని ఏప్రిల్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయటానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రయూనిట్ మూవీ నుంచి టీజర్ విడుదల చేసింది.టీజర్ గమనిస్తే.. 'కిడ్నాప్ అనేది ఒక ఆర్ట్' అనే లైన్‌తో టీజర్ స్టార్ట్ అవుతుంది. ఇక ప్రధాన పాత్రలను పరిచయం చేయటంతో ప్రారంభమైన ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తకరంగా సాగింది. కథంతా కిడ్నాపుల చుట్టూనే తిరుగుతుందని అర్థమవుతోంది. యాక్షన్, డ్రామా, ఫన్.. ఇలా అన్నీ ఎలిమెంట్స్ కలబోసిన ఈ టీజర్ ప్రస్తుతం ప్రేక్షకులని అలరిస్తోంది.వనమాలి క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమాను మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మిస్తుండగా.. వైవా హర్ష, శ్రీకాంత్ అయ్యంగార్, సురేఖవాణి, సమీర్, గుండు సుదర్శన్, జబర్దస్త్ అప్పారావు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## స్నేహితుల కోసం బిర్యానీ వండిన అజిత్.. ఫొటోలు వైరల్



బైక్ రైడింగ్ అంటే సౌత్ ఇండస్ట్రీలో ముందుగా గుర్తుకొచ్చే పేరు తమిళ సూపర్ స్టార్ అజిత్. ఈయనకు బైక్‌లన్నా, బైక్ రైడింగ్‌లన్నా విపరీతమైన ఇష్టమన్నా విషయం తెలిసిందే. ఇప్పటికే చాలా సార్లు ప్రొఫెషనల్ రేసింగ్‌లో కూడా పాల్గొని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇక తన సినిమాలలో కూడా కచ్చితంగా ఒక్కటైనా ఛేజ్ సీన్ కూడా ప్లాన్ చేస్తుంటాడు ఈయన. అజిత్ బైక్ రైడింగ్ కెపాసిటీ తెలిసి దర్శకులు కూడా అలాంటి యాక్షన్ సీన్స్ ప్లాన్ చేస్తుంటారు.అయితే అజిత్ ప్రస్తుతం విదాముయార్చి అనే సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. అయితే ఈ షూటింగ్‌కు కొన్ని రోజులు విరామం రాగా ఫ్రెండ్స్‌తో కలిసి బైక్ రైడింగ్ వెళ్లాడు అజిత్. అయితే అడవిలో తన స్నేహితుల కోసం బిర్యానీ వండాడు. ఇక అజిత్ ఉత్సాహంగా వంట చేస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అవుతున్నాయి.

## జపాన్?లో భూకంపం.. ప్రమాదం నుంచి తప్పించుకున్న రాజమౌళి కొడుకు




టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు రాజమౌళి తనయుడు ఎస్.ఎస్ కార్తికేయ పెను ప్రమాదం తప్పించుకున్నాడు. ప్రస్తుతం జపాన్?లో ఉన్న కార్తికేయ తాను ఓ భూకంపం నుంచి సేఫ్?గా బయట పడినట్లు చెప్పుకొచ్చాడు. మొదటిసారి భూకంపం ఎక్స్?పీరియన్స్?ను చేశామని తెలిపాడు.వివరాల్లోకెళితే.. రాజమౌళి ఫ్యామిలీ ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్?, మెగాపవర్ స్టార్ రామ్? చరణ్‌లతో తెరకెక్కించిన బ్లాక్ బస్టర్ చిత్రం ఆర్ఆర్ఆర్. 2021లో విడుదలైన ఈ చిత్రం రూ.1000 కోట్ల వరకు వసూళ్లను రాబట్టింది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాను ఇటీవలే జపాన్‌లో ప్రత్యేక స్క్రీనింగ్ వేశారు. అయితే ఈ స్క్రీనింగ్ కోసం రాజమౌళి కుటుంబం జపాన్ వెళ్లింది. అయితే ఈ కార్యక్రమం అనంతరం జపాన్‌లోనే పలు ప్రాంతాలు పర్యటన చేస్తున్నారు. ఈ క్రమంలోనే కార్తికేయ ఉన్న భవనంలో భూకంపం అలర్ట్ వచ్చింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా తెలుపుతూ..మొదటిసారి భూకంపం ఎలా ఉంటుందో చూశాం. జపాన్‌లో మేం 28వ అంతస్తులో ఉండగా భవనం మెల్లిగా కదలింది. ఆ తర్వాత ఇది భూకంపం అని అర్థం అయింది. నేను చాలా భయపడ్డాను. కానీ చుట్టూ ఉన్న జపన్ ప్రజలు మాత్రం ఎలాంటి ఆందోళన లేకుండా ఏదో వర్షం పడ టం మొదలవుతోంది అన్నట్టుగా నార్మల్‌గా ఉన్నారు. మొత్తానికి అయితే భూకంపాన్ని ఫస్ట్ టైం లైవ్‌లో రాసుకొచ్చాడు.

# నాలుగు రెట్ల లాభం వచ్చింది



సరికొత్త పాయింట్‌తో 'ఓం భీం బుష్' చిత్రాన్ని తెరకెక్కించామని, ప్రేక్షకుల్ని వినోదంతో పాటు థ్రిల్‌కు గురిచేసే అంశాలెన్నో ఉంటాయని చెప్పారు హీరో శ్రీవిష్ణు. ఆయనతో పాటు ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి హర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు పాత్రికేయులతో పంచుకున్న సంగతులు..

ముగ్గురు మిత్రుల కథ ఇది. సైంటిస్టులం కావాలని పీహెచ్‌డీ చేస్తుంటాం. అయితే మమ్మల్ని ఎలాగైనా కాలేజీ నుంచి పంపించాలని భావించిన యాజమాన్యం అందుకు ఓ స్కెచ్ వేస్తుంది. భైరవపురం అనే ఊరికి మా ముగ్గురిని పంపిస్తారు. అక్కడ ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి? కింగ్స్‌లా బతికే ఫ్రెండ్స్ అక్కడ కూడా అలాగే కింగ్స్‌లా ఎలా మారారు? నిధిని అన్వేషించే వారి ప్రయత్నాలు ఎంత మేరకు సఫలం అయ్యాయనే అంశాలు సినిమాలో ఆసక్తికరంగా ఉంటాయి.ఈ సినిమాకు తొలుత రెండు మూడు టైటిల్స్ అనుకున్నాం. క్యాచీగా ఉంటుందని 'ఓం భీమ్ బుష్'ను ఓకే చేశాం. మనందరం మ్యాజిక్కులు చేయడానికి వాడే మంత్రం కాబట్టి టైటిల్ అందరికి చేరువైంది. సినిమా టైటిల్స్ విషయంలో నేను ప్రత్యేక శ్రద్ధ చూపిస్తాను. సినిమాను తొలుత ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లేది టైటిలే కదా.

ఈ సినిమా ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుంది. కథలో ఓ కొత్త పాయింట్‌ను చర్చించాం. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని పాయింట్ అది. టక్లైమాక్స్‌లో ఆ ఐడియా రివీల్ అయినప్పుడు ప్రేక్షకులు థ్రిల్‌గా ఫీలవుతారు. ఈ కథలో మిస్టరీ, థ్రిల్, ఫాంటసీ, కామెడీ..ఇలా అన్ని అంశాలు సమపాళ్లలో ఉంటాయి.నేను కలెక్షన్స్, మార్కెట్ లెక్కల గురించి అంతగా ఆలోచించను. నాతో సినిమా చేస్తున్న నిర్మాత నష్టపోకూడదనే విషయంపైనే దృష్టి పెడతాను. ఈ సినిమాకు పెట్టిన పెట్టుబడికి ప్రీరిలీజ్ బిజినెస్ ద్వారా ఇప్పటికే మూడు నాలుగురెట్ల లాభం రావడం సంతృప్తినిచ్చింది. ప్రస్తుతం నేను 'శ్వాగ్' అనే చిత్రంలో నటిస్తున్నా. షూటింగ్ పూర్తయింది. ఓ థ్రిల్లర్ చిత్రం చేస్తున్నా. గీతా ఆర్ట్స్‌లో ఓ సినిమా, కోన వెంకట్‌తో ఓ సినిమాకు అంగీకరించా.

## విశ్వంభర కోసం చిరంజీవి రిస్కీ ఫీట్.. మెగాస్టార్ కమిట్‌మెంట్‌కు హాట్సాఫ్ చెప్పాల్సిందే.. !



ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి భారత చలన చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుని.. సూపర్ స్టార్ డమ్ సంపాదించుకున్నాడు టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి . క్లాస్, మాస్, కామెడీ, యాక్షన్ సహా జోనర్ ఏదైనా సరే పాత్రకు ప్రాణం పోసేస్తాడు చిరు.

కెరీర్‌లో బ్లాక్ బస్టర్ హిట్స్ ను అభిమానులకు అందించిన మెగాస్టార్ ప్రయోగాలు చేయడంలో ఎప్పుడూ ముందుంటారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.రాజకీయాలకు గుడ్‌బై చెప్పి రీ ఎంట్రీలోనూ ఏ మాత్రం తగ్గేదేలే అంటున్నాడు. తాజాగా సోషియో ఫాంటసీ నేపథ్యంలో వస్తోన్న విశ్వంభర నటిస్తున్నాడని తెలి సిందే. బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ సినిమా కోసం చిరు రిస్కీ ఫీట్ చేశా డన్న వార్త ఇప్పుడు ఫిలిం నగర్‌లో టాక్ ఆఫ్ ది ఇం డస్ట్రీగా నిలుస్తోంది. యాక్షన్ సీక్వెన్స్ కోసం చాలా రిస్క్ చేశాడట చిరు. హైదరాబాద్ శివారులోని ఓ చెరువులోకి దిగి ఎలాంటి డూప్ లేకుండా ఈ ఫైట్ చేశాడట. మొత్తానికి ఆరు పదుల వయస్సు దాటినా రిస్కీ స్టంట్స్ చేస్తూ.. కుర్ర హీరోలకు మరోసారి స్ఫూర్తిగా నిలుస్తున్నా డన డంలో ఎలాంటి సం దేహం లేదు.ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్నారు.

ఈ మూవీకి ఆర్ఆర్ఆర్ ఫేం లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో డిజిటల్ వ్యూస్ రాబడుతోంది. ఇప్పటికే లాంఛ్ చేసిన టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తుంది. ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.

Owner, Editor, Printed & Published : Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, RNI NO : TELTEL/2023/86487 Cell: 8125972476. website : quicktodaynews@gmail.com, e-mail : gbuchireddy79@gmail.com